నేడు TELUGU DAILY
విలేకరులు కావలెను
అనతికాలంలోనే పత్రికారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేడు తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను. తెలంగాణలోని 33 జిల్లాల్లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు. nedudailynews@gmail.comకు బయోడేటా పంపగలరు.
9346984911
9133445456

సంచలన వార్తలకు
# నేడు
TELUGU DAILY

శుక్రవారం | 17.04.2026 | సంపుటి : 3 | సంచిక :356 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com



**మహిళా బిల్లుతో ఏ రాష్ట్రానికి నష్టం లేదు**

కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ 07

# లోక్‌సభలో మహిళా డీలిమిటేషన్ బిల్లులు



చారిత్రక ఘట్టానికి కేంద్రం శ్రీకారం

డివిజన్ కోరిన విపక్ష సభ్యులు.. స్పీకర్ అంగీకరాం

సభ ఆమోదంతో బిల్లులు ప్రవేశ పెట్టిన కేంద్ర మంత్రి

దేశంలో చరిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టేందుకు గురువారం పార్లమెంట్ ప్రత్యేకంగా సమావేశమైంది. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం 3 బిల్లులను లోక్‌సభ ముందుకు తీసుకొచ్చింది. 02

## మహిళా బిల్లులకు మద్దతిచ్చే పార్టీలకే మనుగడ



మహిళా బిల్లులకు మద్దతిచ్చే పార్టీలకే మనుగడ

ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం

దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదు..

లోక్‌సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 : మహిళా రిజర్వేషన్లను తీసుకురావడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని పేర్కొన్నారు. చట్టసభల్లో మహిళా

-మిగతా 2 లో..



## తెలంగాణలో 17 నుంచి 26కు ఎంపిల సంఖ్య

ఎపిలో 25 నుంచి 38కి పెరుగుదల

తెలంగాణ-26.. ఏపీలో 38

డీలిమిటేషన్‌పై హోంమంత్రి అమిత్ షా వెల్లడి

దక్షిణాదికి అన్యాయం జరగదని వివరణ

డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇది కావాలని చేస్తున్న ప్రచారంగా తిప్పికొట్టారు. ఏపీలో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయన్నారు. తెలంగాణలో 17 నుంచి 26కు పెరుగుతాయని చెప్పారు. కర్ణాటకలో 28 నుంచి 42కు, తమిళనాడులో 39 నుంచి 59కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయని చెప్పారు.

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 : దక్షిణాది జనాభా శాతం కంటే ఎక్కువ సీట్లు పెరుగుతాయని పేర్కొన్నారు. విపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు,

-మిగతా 2 లో..



07

**అంత భావోద్వేగం వద్దు**

'అశోకచక్రం'పై పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం



07

**ఇరాన్ చమురుపై మళ్లీ ఆంక్షలు**

అమెరికా కీలక నిర్ణయం



**బోడుప్పల్‌లో అమానుషం..**

చిన్నారికి యాసిడ్ తాగించిన పిన్ని

ఘట్‌కేసర్: తన కొడుకును ఇంట్లో చిన్నచూపు చూస్తున్నారనే కారణంతో తోడికోడలి కుమారుడిపై దారుణానికి ఒడిగట్టింది ఓ

-మిగతా 2 లో..

## తేజస్వీ వ్యాఖ్యలు తెలంగాణను అవమానించడమే

బేషరతుగా ఆయన క్షమాపణలు చెప్పాలి

మాజీమంత్రి హరీష్ రావు డిమాండ్

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. పార్లమెంట్ వేదికగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్య వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



హైదరాబాద్, ఏప్రిల్ 16 : దశాబ్దాల పోరాటం, వేలాది మంది యువతీ యువకుల త్యాగాల పునాదులపై

-మిగతా 2 లో..



## ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మేడిన్ తెలంగాణ' మార్క్

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామి

ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మేడిన్ తెలంగాణ' మార్క్

అమెరికా పెట్టుబడిదారులకు తెలయి చేయండి

అమెరికన్ నేషనల్ వార్ కాలేజీఇ బృందంతో మంత్రి శ్రీధర్ బాబు

తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని అమెరికా పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. డ్రోన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా 'నేషనల్ వార్ కాలేజ్' బృందంతో గురువారం మంత్రి సమావేశమయ్యారు.యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో స్కిల్డ్ వర్క్ ఫోర్స్ సిద్ధంగా ఉందని.. 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

హైదరాబాద్, ఏప్రిల్ 16 : అమెరికాతో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. టెక్నాలజీ, రీసెర్చ్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో సహకారాన్ని

-మిగతా 2 లో..

## మరోమారు బిజెపి తెలంగాణ వ్యతిరేకత

ప్రధాని మోడీ మొదలు తేజస్వీ వరకు అందరిదీ అదేతీరు

మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై భారతీయ జనతా పార్టీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్ -పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

హైదరాబాద్, ఏప్రిల్ 16 : బీజేపీ నాయకులు పదే పదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. స్వయంగా ప్రధానమంత్రి మోదీ నుంచి మొదలుకొని ఈరోజు పార్లమెంట్ సభ్యుడు తేజస్వి సూర్య వరకు ప్రతి

-మిగతా 2 లో..



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| పారం ధర లైవ్ బర్డ్ | 130 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 157 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 228 (కిలో) |
| స్కిన్ లెస్ | 259 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹70

## మంత్రాలయం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

బొలెరోను ఢీకొన్న రెడీమిక్స్ వాహనం

ప్రమాదంలో 8మంది మృతి.. పలువురికి గాయాలు

మృతులు కర్నాటక వాసులుగా గుర్తింపు



కర్నూలు,ఏప్రిల్16(ఆర్ఎన్ఎ): కర్నూలు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంత్రాలయం మండలం

-మిగతా 2 లో..

## డీలిమిటేషన్‌పై కుట్ర రాజకీయాలు


ఉత్తరాది దక్షిణాది అంటూ విభజన రేఖలు

మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు

హైదరాబాద్, ఏప్రిల్ 16 : కాంగ్రెస్ మరోసారి దేశ విభజనకు కుట్రలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావుఆరోపించారు. సౌత్, నార్త్ అంటూ కాంగ్రెస్ పెద్ద కుట్ర చేస్తోందన్నారు. డీలిమిటేషన్‌పై తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు పార్టీ కార్యాలయంలో మీడియాతో



-మిగతా 2 లో..



## దేశవ్యాప్తంగా మండుటెండలు

అప్రమత్తంగా ఉండాలన్న ఐఎండి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 : దేశ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు భగభగమండుతున్నాడు. మధ్యాహ్నం బయట తిరగాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశంలోని

-మిగతా 2 లో..

# చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుట్టిన కేంద్రం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 : ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన తర్వాత.. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్, హోంమంత్రి అమిత్ షా వీటిని ప్రతిపాదించారు. అనంతరం వీటిని సభలో ప్రవేశపెట్టేందుకు చర్చ చేపట్టారు. ఈ బిల్లులను వ్యతిరేకించిన విపక్షాలు.. డివిజన్ ఓటింగ్‌కు పట్టుబట్టాయి. అందుకు స్పీకర్ ఓం బిర్లా సమ్మతించారు. డివిజన్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లును ప్రవేశపెట్టేందుకు మద్దతుగా 251 ఓట్లు పోలయ్యాయి. 185 మంది దీనికి వ్యతిరేకంగా ఓటేశారు. మెజార్టీ సాధించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కేంద్రం ఈ మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసే బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం కల్పించే బిల్లులను ఒకేసారి పరిశీలించి, ఆమోదించేలా లోక్‌సభ నిబంధన 66లోని ప్రొవైజోను సస్పెండు చేసి అనుమతించాలని కోరుతూ కేంద్ర మంత్రి మేఘ్‌వాల్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ బిల్లులు రాజ్యాంగ సవరణ బిల్లుతో ముడిపడి ఉన్నందున అనుమతించాలని అందులో కోరారు. ఈ బిల్లులపై చర్చకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వీటిపై ఓటింగ్ నిర్వహించ నున్నట్లు సభాపతి తెలిపారు. ఈ మూడింటిలో లోక్‌సభ సీట్లను 550 నుంచి గరిష్ఠంగా 850కి పెంచడంతో పాటు 2011 జనాభా లెక్కల ప్రకారమే దేశంలో డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టే 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, లోక్‌సభ- అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు అవసరమైన డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన మరో బిల్లు ఉన్నాయి. వీటిని కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ప్రవేశపెట్టారు. ఇక, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం కల్పించే ఇంకో బిల్లును హోంమంత్రి అమిత్ షా సభ ముందు ఉంచారు. వీటిపై లోక్‌సభలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. ప్రధాని మోదీ ఈ సాయంత్రం లోక్‌సభలో ప్రసంగిస్తారు. ఇందులో ఒకటి రాజ్యాంగ సవరణ బిల్లు. మిగతా రెండూ చట్టపరమైన బిల్లులు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ కావాలి. మిగతా రెండింటికీ సాధారణ మెజారిటీ సరిపోతుంది. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 540 మంది సభ్యుల్లో 2/3వ వంతు మెజారిటీతో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే 360 మంది సభ్యుల మద్దతు అవసరం. అధికారిక ఎన్డీయే కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. బిల్లు ఆమోదానికి మరో 68 మంది మద్దతు అవసరం. డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నామని చెబుతున్న ఇండియా కూటమి ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని చెప్పడంతో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదంపై ఉత్కంఠ నెలకొంది.



## మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే మూల్యం తప్పదు

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు ఉద్దేశించిన 3 కీలక బిల్లులను కేంద్రం నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. వీటిపై చర్చలో భాగంగా ప్రధాని మోదీ సభలో ప్రసంగించారు. మహిళా రిజర్వేషన్ల ను వ్యతిరేకించే వారు మూల్యం చెల్లించుకోక తప్పదంటూ విపక్షాలను హెచ్చరించారు.

### గిఫ్ట్ కాదు.. ఇది హక్కు

"దేశ పార్లమెంట్ చరిత్రలో ఈ రోజును మర్చిపోలేం. మహిళా రిజర్వేషన్ గొప్ప బిల్లు. ఈ చారిత్రక సమయంలో పాలు పంచుకోవడం నా అదృష్టం. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు" అని మోదీ వ్యాఖ్యానించారు.

### ఆ పార్టీలకే మనుగడ..

"మహిళా రిజర్వేషన్ల కోసం 30 ఏళ్ల పాటు ప్రయత్నాలు జరిగినా గతంలో ఇది సాకారం కాలేదు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని మేం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 2029 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లే. ఈ బిల్లును తేవడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదు. ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదు. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించే వారిని మహిళలు క్షమించరు. బిల్లును వ్యతిరేకించే పార్టీలకు, నేతలకు మహిళలు బుద్ధి చెబుతారు. సమయం చూసి దెబ్బకొడుతారు. మహిళా బిల్లులకు మద్దతిచ్చే పార్టీలకే మనుగడ ఉంటుంది" అని విపక్షాలకు ప్రధాని చురకలంటించారు.

### దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదు..

"ఈ బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతున్నారు. అలాంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం" అని మోదీ స్పష్టం చేశారు.

### నాకు క్రెడిట్ వద్దు.. మీరే తీసుకోండి

"ఈ బిల్లుతో దేశంలోని మహిళలకు వారి హక్కులను కల్పిస్తున్నాం. ఈ బిల్లుపై క్రెడిట్ నాకు అవసరం లేదు. మీరే (విపక్షాలను ఉద్దేశిస్తూ) తీసుకోండి.. మహిళా బిల్లుపై అన్ని పార్టీల నేతల ఫొటోలూ వేసుకోండి. ఈ బిల్లును అడ్డుకోకుండా సహకరించి మీ గొప్పతనం చాటుకోండి. మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదిద్దాం" అని మోదీ విపక్షాలను కోరారు.

## డీలిమిటేషన్‌పై కుట్ర రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)



చిట్‌చాట్‌గా మాట్లాడారు. గతంలో మహిళా బిల్లు అమలు చేయాలన్న రాహుల్‌గాంధీ.. ఇప్పుడెందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. నార్త్‌లో కాంగ్రెస్ పోయిందని.. త్వరలో సౌత్‌లో కూడా పోతుందంటూ వ్యాఖ్యానించారు. రేవంత్ ట్రాప్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రజలు పడరని.. సౌత్ ప్రజలు తెలివైన వారన్నారు. రేవంత్ రెడ్డి నార్త్ సౌత్ డివిజన్ రాజకీయాలు చేస్తున్నారంటూ టీబీజేపీ చీఫ్ మండిపడ్డారు. రీజినల్ పార్టీలు మాట్లాడుతున్నాయంటే ఏదో అనుకోవచ్చు.. కానీ కాంగ్రెస్ లాంటి జాతీయ పార్టీ ఇలాంటి మాటలు మాట్లాడటం సరికాదని తెలంగాణ బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు పేర్కొన్నారు. కేరళ కంటే తెలంగాణ జనాభా ఎక్కువ. కేరళలో 20 ఎంపీ సీట్లు ఉంటే.. తెలంగాణలో 17 మాత్రమే ఉన్నాయి. సీఎం రేవంత్ ముందు కేరళలో సీట్లు తగ్గించమని కోరాలి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా జనాభా ఉన్న రాష్ట్రాల్లో తక్కువ సీట్లు ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ చేయాలని రాహుల్ గాంధీ కొత్త పార్లమెంట్ భవనంలోనే కోరారు. ఇప్పుడు 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. దక్షిణాదిలో కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభా తగ్గింది.. ఉత్తరాదిన పాటించలేదని రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి వితండ వాదం చేస్తున్నారు. జీఎస్‌డీపీ మీద సీట్లు పెంచమనడం సరైంది కాదు. లోక్‌సభలో పెప్పర్ స్ప్రే చేయాలనే ప్లాన్‌లో కాంగ్రెస్ ఉంది. రాహుల్ గాంధీకి మించి రేవంత్ జాతీయ నాయకుడిగా ఎదుగుతున్నారు. రాహుల్ గాంధీకి సబ్జెక్ట్ తెలియక మాట్లాడటం లేదా? రేవంత్‌కు సబ్జెక్ట్ ఎక్కువ ఉండి మాట్లాడుతున్నారా? డీలిమిటేషన్‌ను ముందు వ్యతిరేకించింది స్టాలిన్. రేవంత్‌రెడ్డి మాత్రమే దక్షిణాది, ఉత్తరాది అని వైషమ్యాలు సృష్టిస్తున్నారు. తెలంగాణలో 50 శాతం సీట్లు పెరిగితే.. యూపీలో 50 శాతం పెరుగుతాయి. దక్షిణాదిలో సీట్లు గతంలోనే తగ్గాయి.. ఇప్పుడు తగ్గుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన కుల గణన సక్రమంగా జరగలేదు. మా గల్లీలో ఎవరి ఇంటికీ ఎన్యూమరేటర్ రాలేదు. ఉత్తరాదిలో కాంగ్రెస్ లేదు.. దక్షిణాదిలో కూడా పోతుంది. దక్షిణాదిలో కాంగ్రెస్ కంటే భాజపాకే ఎక్కువ ఎంపీ సీట్లు ఉన్నాయి. దేశంలో ఎప్పుడూ ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికల్లో లబ్ధి పొందడానికే అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల తర్వాత పెడితే యూపీ ఎన్నికలు అంటారు.. ఆ తర్వాత పెడితే తెలంగాణ ఎన్నికలు అంటారు. అందుకే వన్ నేషన్ వన్ ఎలక్షన్ వస్తే మంచిదని రామచందర్ రావు అన్నారు.

## మరోమారు బిజెపి తెలంగాణ వ్యతిరేకత

(మొదటిపేజీ తరువాయి)



ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారన్నారు. తెలంగాణ ఏర్పాటు పైన విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టు కుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని కేటీఆర్ దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సైతం బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణం అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వి సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని , లేకుంటే తేజస్వి సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందన్నారు.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

మరింత పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏరోస్పేస్ రంగం ఏటా సగటున 30 శాతం వృద్ధి నమోదు చేస్తోంది. ఎగుమతుల్లో 103 శాతం సీఏజీఆర్‌తో తెలంగాణ దూసుకుపోతోంది. రాకెట్ల నుంచి శాటిలైట్ల వరకు అన్ని ఉత్పత్తులపై 'మేడ్ ఇన్ తెలంగాణ' ముద్ర పడుతోంది. ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో తమ కార్యకలాపాలు విస్తరించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1500కి పైగా ఎంఎస్ఎంఈలతో తెలంగాణ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదుగుతోంది. 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ టాప్ స్థానంలో నిలిచింది. వరుసగా ఐదు సార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందుకోవడం తెలంగాణ సాధించిన మరో విజయం. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలని, ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్స్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్డ్ కమ్యూనికేషన్స్ లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఇక్కడి అనుకూలతలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీలు మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వివరించారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు... అన్నింటిలోనూ 'మేడిన్ తెలంగాణ' మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందన్నారు. ఈ రంగంలో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వృద్ధిని రేటును నమోదు చేస్తోందన్నారు. అలాగే... 2024-26 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్(సీఏజీఆర్) నమోదయ్యిందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్ బస్, దస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్,ఆర్ సీఐ, హాల్ తదితర కేంద్ర రంగ ప్రభుత్వ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇవీ కాకుండా... ప్రిసిషన్ ఇంజనీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్'ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ÷నాన్షియల్ టైమ్స్ ఎఫ్ డీఏ ర్యాంకింగ్స్ ప్రకారం, ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును గెలుచుకుని 'గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్'లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారిందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు అవసరమైన ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీజీ ఐపాస్ ద్వారా 15 నుంచి 30 రోజుల్లోగా అనుమతులు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన 'రెడీ టూ స్కిల్ వర్క్ ఫోర్స్'ను అందిస్తున్నామన్నారు. పెట్టుబడులకు మాత్రమే కాదు, సాంకేతికత, పరిశోధన, తయారీ, నైపుణ్యాభివృద్ధిలో అమెరికాకు ఒక నమ్మకమైన దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామిగా నిలిచేందుకు 'తెలంగాణ' సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, అడ్వాన్స్డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ టెక్నాలజీ తదితర రంగాల్లో అమెరికా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. 'తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, రాబోయే రోజుల్లో ఆ దిశగా అడుగులు వేస్తాం. అమెరికా,తెలంగాణ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు చొరవ చూపుతాం' అని స్టేట్ డిపార్ట్ మెంట్ మినిస్టర్ కౌన్సిలర్ పాల్ నరైన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ ఫ్రాంక్ ఒకటా(నేవీ), రెనో బామ్‌ఫోర్డ్(డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ జాన్ కయాంగ్యాంగ్(ఆర్మీ), రెబెక్కా కింగ్(డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ మైఖేల్ కూబ్(ఎయిర్ నేషనల్ గార్డ్), జోస్ సలాస్(డిఫెన్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఏజెన్సీ), టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రాలయం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

చిలకలడోన వద్ద బొలెరో వాహనం-రెడీమిక్స్ లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో 8 మంది మృతిచెందగా.. 13 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎమ్మిగనూరులోని ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలోనే ఐదుగురు మృతిచెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, బాలిక ఉన్నారు. కర్ణాటకలోని చిక్‌మంగళూరుకు చెందిన భక్తులు మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులు కుమార్ (60), దీపిక వీణ (35), సునీల్ (40), బెల్లి (3), పుట్టమ్మ (60), మీనాక్షి (50), తాయమ్మ (60), లోలాక్షిగా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందడంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన పట్ల విచారణ వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంపై ఏపీ మంత్రులు భరత్, జనార్దన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

## తెలంగాణ-26.. ఏపీలో-38

(మొదటిపేజీ తరువాయి)

డీలిమిటేషన్ సంబంధిత బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా అమిత్ షా ఈ వివరాలు వెల్లడించారు. జనాభా గణన ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, కుల గణన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని , ప్రస్తుతం గృహ గణన పనులు జరుగుతున్నాయని, జనాభా గణన జరిగినప్పుడు కుల గణన కూడా చేర్చుతామని ఆయన చెప్పారు. మత ఆధారిత రిజర్వేషన్ల ఆలోచనను అమిత్ షా తిరస్కరించారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని, మతం ఆధారంగా ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన చెప్పారు. రాజ్యాంగంలో అలాంటి అవకాశం లేదన్నారు. అఖిలేష్ యాదవ్ డిమాండ్లపై విమర్శలు చేస్తూ.. అఖిలేష్ యాదవ్ తన పార్టీ టికెట్లన్నీ ముస్లిం మహిళలకు ఇవ్వొచ్చని, ఆయన పార్టీకి ఎలాంటి సమస్యల ఉండదని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన అన్నారు.

## బోడుప్పల్‌లో అమానుషం..

(మొదటిపేజీ తరువాయి)

మహిళ. నాలుగేళ్ల చిన్నారికి ఆమె యాసిడ్ తాగించింది. ఈ ఘటన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ శ్రీనివాస కాలనీలో ఉండే పర్వతం సతీష్ కుమార్, అంజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు నాగరాజు, జగదీష్ ఉన్నారు. వారిద్దరికి వివాహాలు అయ్యి, పిల్లలు ఉన్నారు. అంతా ఒకే ఇంట్లో ఉంటున్నారు. పెద్ద కుమారుడి కొడుకు (4)పై తాత ఎక్కువ ప్రేమ చూపిస్తున్నాడని, తన బిడ్డను పట్టించుకోవడం లేదని చిన్న కోడలు మంజుల కక్ష పెంచుకుంది. ఇటీవల తాత తన చేతిపై పెద్ద కుమారుడి కొడుకు పేరు పచ్చబొట్టు వేయించుకున్నారు. దీంతో ఆమె ఆ పిల్లాడిని అంతమొందించాలనే నిర్ణయానికి వచ్చింది. ఇటీవల ఇంట్లో చిన్నారి నోరు, ముక్కు మూసి చేతులు పట్టుకుంది. బాలుడి తల్లి గమనించి, ప్రశ్నించడంతో ఆడుకుంటున్నామని చెప్పి తప్పించుకుంది. మరోసారి ఆ బాలుడిని ఇంటిపై అంతస్తుకు తీసుకెళ్లి రెయిలింగ్‌పై కూర్చోబెట్టింది. ఇది గమనించిన తాత ఆమెను మందలించాడు. ఈ నెల 9న మంజుల అతడిని కిచెన్‌లోకి తీసుకెళ్లి జ్యూస్ తాగితే చాక్లెట్ ఇస్తానని చెప్పి.. యాసిడ్ తాగించింది. బాలుడి పరిస్థితి గమనించిన తల్లిదండ్రులు సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. బుధవారం రాత్రి చిన్నారి తల్లి.. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తేజస్వీ వ్యాఖ్యలు తెలంగాణను అవమానించడమే

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పడిన తెలంగాణను, రక్తపాతంతో కూడిన దేశ విభజనతో పోల్చడం అమరవీరుల త్యాగాలను అవమానించడమేనని మండిపడ్డారు. ఇవాళ బీఆర్ఎస్ ఎంపీలే గనుక సభలో ఉండి ఉంటే తేజస్వి సూర్య సంగతి తేల్చిపారేసేవారని హరీష్‌రావు అన్నారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా జరిగిందని గుర్తుచేసిన హరీశ్ రావు.. ఈ రాష్ట్రం నేడు దేశానికే ఆదర్శంగా నిలవడాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. ఒకవేళ తెలంగాణ ఏర్పాటు భారత్-పాక్ విభజన వంటిదే అయితే, ఆనాడు పార్లమెంట్‌లో బీజేపీ ఈ బిల్లుకు ఎందుకు మద్దతు ఇచ్చిందని ప్రశ్నించారు. గతంలో ప్రధాని మోదీ కూడా రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు తేజస్వి సూర్య అదేబాటలో నడుస్తూ విషం చిమ్ముతున్నారని హరీష్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల మౌనాన్ని హరీశ్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి, ఢిల్లీ పెద్దల ముందు రాష్ట్ర గౌరవాన్ని తాకట్టు పెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవంపై దాడిచేసే శక్తులను ఇక్కడి ప్రజలు ఎన్నడూ క్షమించరని, త్యాగాల చరిత్రను అగౌరవపరిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు.

## దేశవ్యాప్తంగా మండుటెండలు

(మొదటిపేజీ తరువాయి)

చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. వడగాల్పుల కారణంగా జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ ప్రజలకు కీలక సూచనలు చేసింది. వడదెబ్బలు తగిలే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ గురువారం ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది. ఆ పోస్టులో.. 'ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడగాడ్పులు తీవ్రతరం అవుతున్నాయి. వడదెబ్బల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండండి. వీలైనంత ఎక్కువ నీళ్లు తాగండి. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో కష్టమైన పనులు చేయకండి. లైట్ కలర్ దుస్తులు ధరించండి. తరచుగా విశ్రాంతి తీసుకుంటూ ఉండండి. వడదెబ్బ తగిలితే .. వెంటనే ఆ వ్యక్తిని చల్లని ప్రదేశానికి తరలించండి. నేలపై పడుకోబెట్టండి. నీళ్లలో తడిపిన బట్టను కప్పండి. చల్లని నీళ్లు తాగించండి. నీటి శాతం ఎక్కువగా ఉన్న ఆహారాపదార్థాలను అతడికి తినిపించండి' అని సూచించింది. ఏప్రిల్ 20వ తేదీ వరకు తెలంగాణ, రాయలసీమ, మధ్య మహారాష్ట్ర, మరాఠ్వాడా, ఉత్తర కర్ణాటక, మధ్య ప్రదేశ్, విదర్భ, ఒడిశా, జార్ఖండ్, వెస్ట్ రాజస్థాన్‌లలో అత్యంత తీవ్రంగా వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. కేరళ, తమిళనాడు, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని సముద్ర తీర ప్రాంతాల్లో వేడి, పొడి వాతావరణ పరిస్థితులు ఉంటాయని వెల్లడించింది.

# పక్కా ప్లాన్ ప్రకారమే సమావేశాలు

- లోక్‌సభ సీట్లు పెంచడంపైనే మీ దృష్టి
- మహిళా రిజర్వేషన్లను ఎవ్వరూ వ్యతిరేకించడం లేదు
- చాణుక్యుడు బతికుంటే మీ కుయుక్తికి ఆశ్చర్య పోయేవాడు
- లోక్‌సభలో ప్రియాంక సెటైర్లు.. అమిత్‌షా నవ్వులు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 :** కేంద్రం ప్రతిపాదించిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎంపీ ప్రియాంకా గాంధీ మాట్లాడుతూ...చాణుక్యుడు కూడా ఇంత పక్కాగా ప్లాన్ చేసి ఉండలేదని అన్నారు. మహిళా కోటా బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని, అయితే దీనిని అమలు చేయడానికి డీలిమిటేషన్ చేస్తుండటంపైనే తమ అభ్యంతరాలు ఉన్నాయని లోక్‌సభలో ఆమె అన్నారు. ఎన్నికల్లో పైచేయి సాధించడానికి ఇది ఒక రాజకీయ అస్త్రం అని ఆమె ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని దెబ్బతీయడానికి బీజేపీ తన పార్టీ పునాదులను బలోపేతం చేసుకుంటోందని ఆమె అన్నారు. ఇదిలా ఉంటే, చాణక్యుడిని ప్రస్తావిస్తూ ఆమె వేసిన సెటైర్లు సభలో నవ్వులు పూయించాయి. కేంద్రం హోం మంత్రి అమిత్ షా కూడా ప్రియాంకా వ్యాఖ్యలకు నవ్వారు. మీరంతా పక్కా ప్లాన్‌తో వచ్చారు. ఈ రోజు గనుక చాణక్యుడు బతికి ఉంటే మీ కుయుక్తికి ఆయన ఆశ్చర్యపోయి ఉండేవారని ఆమె అన్నారు. రాష్ట్ర ఎన్నికల సమయంలో హఠాత్తుగా పార్లమెంట్ ఏర్పాటు చేయడం, ఎన్నికలకు ఒక రోజు ముందే ముసాయిదా ముందుకు తేవడం, మహిళా అభ్యున్నతి కోసం మోడీ అతిపెద్ద నిర్ణయం తీసుకున్నారని మీడియాలో చర్చ జరిపించడం, ప్రతీ ఒక్కరూ ఆయనకు మద్దతు ఇచ్చేలా చేయడం, ఇలా ప్రతిపక్షాలను సందిగ్దంలో పడేయడం అంతా ప్లాన్ అంటూ ఆమె ఆరోపించారు. ఈ వ్యాఖ్యలుకే అమిత్ షాతో పాటు మంత్రులు కిరెన్ రిజిజు నవ్వారు. అంతకముందు ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాన్ని తప్పుపట్టిన ఆమె.. అందులో జవహర్‌లాల్ నెహ్రూ పేరు వినిపించకపోవడం గమనార్హం అని అన్నారు. మహిళల హక్కుల పట్ల బీజేపీ నేతలే ఛాంపియన్లుగా భావిస్తున్నారని ఆమె విమర్శించారు. మోదీ ప్రసంగంలో నెహ్రూ పేరు వినిపించకపోవడం ఆశ్చర్యం కలిగించింది. రిజర్వేషన్లపై 2018లోనే ప్రధాని నరేంద్ర మోదీకి రాహుల్ గాంధీ లేఖ రాశారు. 2019లోపే రిజర్వేషన్లు అమలు చేయాలని రాహుల్ కోరారు. ప్రధాని మోదీ సగం సమాచారం మాత్రమే వెల్లడించారు. ఇవాళ ప్రధానంగా రిజర్వేషన్ల కోటాపై చర్చ కాదు.. లోక్‌సభ సీట్లను 850కి పెంచడంపైనే. మోదీ ప్రభుత్వం లోక్‌సభ సీట్ల పెంపుపైనే ఆసక్తి కనబరుస్తోంది. ఆ విషయంలో ప్రభుత్వానికి అంత తొందరెందుకని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఎవరూ వ్యతిరేకించలేదు. రాహుల్ స్వయంగా మోదీ దగ్గరకు వెళ్లి మరీ మద్దతు తెలిపారు. ఆ బిల్లుపై క్రెడిట్‌ను మోదీ.. కాంగ్రెస్‌కు ఇవ్వలేదు. దేశ మహిళలకు కాంగ్రెస్ ఎంతో సేవ చేసింది. బిల్లు విషయంలో మహిళలను బీజేపీ తప్పుదోవ పట్టిస్తోంది. మహిళా బిల్లును ఎవరు వ్యతిరేకిస్తున్నారో మోదీ చెప్పాలి. కులగణనకు మోదీ ఎందుకు భయపడుతున్నారు? ఓబీసీలకు న్యాయం జరగాలి.. వారి హక్కులను ఎవరూ కాలరాయలేరు' అని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు.

## తేజస్వీ వ్యాఖ్యలు సరికాదు : వద్దిరాజు

**హైదరాబాద్, ఏప్రిల్ 16 :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య దేశ విభజనతో పోల్చడాన్ని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వాన ప్రజలు అహింసా మార్గంలో ఉద్యమించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం యావత్ ప్రపంచానికి తెలిసిందేనని పేర్కొన్నారు. ఈ వాస్తవాన్ని మర్చిపోయి బీజేపీ ఎంపీ దేశ విభజనతో పోల్చడం దుర్మార్గమన్నారు. దేశ అత్యున్నత చట్టసభలో కనీస అవగాహన లేకుండా మాట్లాడిన ఆయన తెలంగాణ ప్రజలను అవమానించడమేనని, ఈ వ్యాఖ్యల్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఓట్లతో ఎంపీలుగా ఎన్నికైన తెలంగాణకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు తీవ్రంగా ఖండించాలని కోరారు.

## ఏసీబీకి చిక్కిన విద్యుత్ ఏడీఈ

**30వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత**

**నల్గొండ, ఏప్రిల్ 16 :** రాష్ట్రంలో ప్రతిరోజు అవినీతి అధికారులు ఏసీబీకి పట్టుబడుతున్నారు. తాజాగా నల్గొండ జిల్లా దేవరకొండ ఏడీఈ సిరికొండ సైదులు గురువారం బాధితుడు నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కాడు. గత సంవత్సరం కంబాలపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌పై పిడుగుపడి మరమ్మతులకు గురైంది. మరమ్మతులకు అయిన రూ.10 లక్షల బిల్లుల కోసం అధికారిని సంప్రదించగా లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు నల్గొండ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకుని, కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్

**స్పీకర్ సహా 9మంది వివరణ కోరిన హైకోర్టు**

**విచారణ మే 6కు వాయిదా**

**హైదరాబాద్, ఏప్రిల్ 16 :** తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వేటు వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 9 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మారలేదని స్పీకర్ ప్రకటించిన 9 మంది ఎమ్మెల్యేల తో పాటు, స్వయంగా స్పీకర్ కూడా ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. వీరంతా తమ వాదనలతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌లను దాఖలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జాబితాలో ఉన్న ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అరెకపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాష్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి (సంజయ్), తెల్లం వెంకట్రావు ఉన్నారు. గతంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన ఈ ఎమ్మెల్యేలు సాంకేతికంగా పార్టీ మారలేదని, వారు ఇంకా బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నారనే అర్థం వచ్చేలా స్పీకర్ తీర్పునిచ్చారు. అయితే, వారు బహిరంగంగానే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. స్పీకర్ నిర్ణయం ఏకపక్షంగా ఉందన్నది వారి ప్రధాన వాదన. ఈ కేసులో లోతైన విచారణ అవసరమని భావించిన హైకోర్టు, తదుపరి విచారణను మే 6వ తేదీకి వాయిదా వేసింది. ఈలోగా ప్రతివాదులందరూ తమ కౌంటర్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న ఈ కేసులో హైకోర్టు తీర్పు ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ కలిగిస్తోంది. ఒకవేళ కోర్టు అనర్హత వేటు విషయంలో కఠినంగా వ్యవహరిస్తే, రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉంటుందా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా ఉంది.

## మహిళా బిల్లు, పునర్విభజనపై మొసలి కన్నీళ్లు

- డిఎంకె తీరుపై మండిపడ్డ బిజెపి ఎంపి తేజస్వీ సూర్య
- రేవంత్ హైబ్రీడ్ మోడల్‌పైనా ఆగ్రహం
- కాంగ్రెస్ తీరుపై మండిపడుతూ..ఎపి విభజనపై వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 :** లోక్‌సభలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లుపై జరుగుతున్న చర్చ సందర్భంగా కర్ణాటకకు చెందిన బీజేపీ యువ ఎంపీ తేజస్వి సూర్య విపక్షాలపై, ప్రధానంగా డీఎంకే పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అలాగే తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి హైబ్రీడ్ మోడల్‌పైనా విమర్శలు గుప్పించారు. పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గుతుందంటూ డీఎంకే చేస్తున్న వాదనలను ఆయన 'మొసలి కన్నీళ్లు'గా అభివర్ణించారు. 'ప్రతి పౌరుడి ఓటుకు సమాన విలువ ఉండాలన్నది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అన్నారు. జనాభా ప్రాతిపదికన స్థానాల కేటాయింపు జరగడం ప్రజాస్వామ్య సూత్రం' అని తేజస్వి సూర్య పేర్కొన్నారు. డీఎంకే వంటి పార్టీలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉత్తరాది-దక్షిణాది విభజనను సృష్టించాలని చూస్తున్నాయని ఆయన ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల సీట్లు తగ్గుతాయనే ఆందోళనలను ఆయన తోసిపుచ్చారు. 'ప్రధాని మోదీ నాయకత్వంలో ఏ ఒక్క రాష్ట్రానికీ అన్యాయం జరగదు. మొత్తం సీట్ల సంఖ్య పెరగడం వల్ల అన్ని ప్రాంతాలకు ప్రాతినిధ్యం మెరుగుపడుతుందే తప్ప తగ్గదని ఆయన స్పష్టం చేశారు. కేవలం భయాందోళనలు సృష్టించడం ద్వారా మహిళా రిజర్వేషన్ల అమలును అడ్డుకోవాలని డీఎంకే ప్రయత్నిస్తోందని విమర్శించారు. గతంలో మహిళా బిల్లును అడ్డుకున్న పార్టీలతో డీఎంకే జట్టు కట్టిందని, ఇప్పుడు మహిళల కోసం మాట్లాడుతుండటం హాస్యాస్పదమని ఆయన ఎద్దేవా చేశారు. 2029 నాటికి మహిళలకు 33 శాతం కోటాను అమలు చేయాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని అడ్డుకోవడానికి డీఎంకే కుంటి సాకులు వెతుకుతోందని మండిపడ్డారు. పునర్విభజన అనేది జనాభా గణాంకాల ప్రకారం జరిగే రాజ్యాంగబద్ధమైన పక్రియ అని, దీనిని రాజకీయ కోణంలో చూడటం సరికాదని తేజస్వి సూర్య తన ప్రసంగంలో నొక్కి చెప్పారు. ఈ బిల్లుల ద్వారా భారతదేశ పార్లమెంటరీ వ్యవస్థలో మహిళలకు సరైన గౌరవం లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇకపోతే తెలంగాణ సిఎం హైబ్రిడ్ మోడల్‌ను ఆయన ఫూలిష్ ఆర్యగుమెంట్‌గా అభివర్ణించారు. జిఎస్‌డిపి అంటూ చేసిన వ్యాఖ్యలు సరికావన్నారు. ఇది రాజ్యాంగం ప్రకారం చెల్లదని అన్నారు. అలాగే తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వివాదాస్పద కామెంట్స్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ను పాకిస్తాన్ తో పోల్చారు. బ్రిటీష్ వారి కంటే చెత్తగా ఏపీని విభజించారని ఆరోపించారు. భారత్ నుంచి పాకిస్తాన్ ను విడదీసినట్లుగా ఏపీని విభజించారని అన్నారు. ఇలాంటి విధానాలతో ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి హైబ్రీడ్ మోడల్ అంటూ చేస్తున్న వాదనలను తిప్పి కొట్టారు. జిఎస్‌డిపి బాగా ఉన్నప్పుడు సీట్లు పెంచితే...తగ్గితే సీట్లు తగ్గించాలా అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ విధానాలే ఇలా ఉంటాయని అన్నారు.

## మహిళా రిజర్వేషన్లు మహిళల హక్కు

- ఎంతోకాలంగా ఈ బిల్లు పెండింగ్‌లో ఉంది
- గతంలో సమాజ్‌వాది పార్టీ అడ్డుకుంది
- మహిళలకు ఆస్తిలో సమానవాటా ఇచ్చిన ఘనత ఎన్టీఆర్‌ది
- బిల్లును అనవసర కారణాలతో అడ్డుకోరాదు
- రాజమండ్రి ఎంపి పురందేశ్వరి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 :** మహిళా రిజర్వేషన్ డిమాండ్ ఎప్పటి నుంచో ఉందని రాజమండ్రి లోక్‌సభ ఎంపీ పురందేశ్వరి అన్నారు. గతంలో చాలాసార్లు బిల్లు పెట్టినా సాకారం కాలేదని, అప్పట్లో సమాజ్‌వాదీ పార్టీ మద్దతివ్వలేదని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా లోక్‌సభలో ఆమె మాట్లాడారు. రాజకీయాల్లో మహిళల పాత్ర పెరిగిందని గ్రహించాలన్నారు. ఈ బిల్లు పాస్ కావడం మహిళల దశాబ్దాల కల. 2023లో మద్దతిచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు మాత్రం కొర్రీలు పెడుతోంది. జనగణన పేరుతో అభ్యంతరాలు చెబుతోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు మొట్టమొదట 1996లో ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ మాత్రం ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టిందని అన్నారు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పునర్విభజన 131వ రాజ్యాంగ సవరణ బిల్లులపై జరిగిన చర్చలో పలు విషయాలు వెల్లడించారు. ఈ చారిత్రక బిల్లులకు పూర్తి మద్దతు ప్రకటించిన ఆమె, మహిళా రిజర్వేషన్ల అమలులో గత ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టారు. ప్రసంగం ప్రారంభంలో ఆమె తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మహిళా సాధికారత కోసం చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. నాలుగు దశాబ్దాల క్రితమే ఆస్తిలో కుమార్తెలకు సమాన హక్కులు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు, మహిళా విశ్వవిద్యాలయం, మహిళా పోలీస్ స్టేషన్ల ఏర్పాటు వంటి విప్లవాత్మక నిర్ణయాలను ఆయన తీసుకున్నారని సభకు వివరించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ సీట్లను కోల్పోతాయన్న ఆందోళనలపై ఆమె స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రణాళిక ప్రకారం, లోక్‌సభ స్థానాల సంఖ్యను 50 శాతం పెంచడం వల్ల ఏ రాష్ట్రానికి ఉన్న ప్రస్తుత సీట్లు తగ్గవని భరోసా ఇచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సీట్ల పెంపు ఉండటం వల్ల రాజకీయ సమతుల్యత దెబ్బతినదని, దక్షిణాది రాష్ట్రాల గొంతు పార్లమెంట్‌లో బలంగానే ఉంటుందని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయడంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం గతంలో తీవ్ర జాప్యం చేసిందని పురందేశ్వరి విమర్శించారు. 1996 నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ బిల్లును 2010లో రాజ్యసభ ఆమోదించినా, లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి కాంగ్రెస్‌కు మనసు రాలేదని ఎద్దేవా చేశారు. ఇప్పుడు ప్రధాని మోదీ ఈ బిల్లును యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తుంటే, విపక్షాలు అనవసరపు రాజకీయ కారణాలతో అడ్డుకోవాలని చూడటం సరికాదన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలు వల్ల దేశాభివృద్ధిలో మహిళలు కేవలం భాగస్వాములుగా మాత్రమే కాకుండా, నిర్ణేతలుగా మారతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఈ బిల్లు మహిళలకు రాజకీయ న్యాయం చేకూరుస్తుందని పేర్కొన్నారు. పునర్విభజన పక్రియలో ప్రతి రాష్ట్రం గొంతు వినబడుతుందని, పబ్లిక్ హియరింగ్స్ ద్వారా ప్రజల అభిప్రాయాలను తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ చారిత్రక ఘట్టంలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందని చెబుతూ ఆమె తన ప్రసంగాన్ని ముగించారు.

## చెల్పూర్ కేటీపీపీలో అగ్నిప్రమాదం

**జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 16 :** చెల్పూర్ కేటీపీపీ లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్లాంట్ ఆవరణలో నిల్వ ఉంచిన రిజెక్ట్ కోల్ నిల్వల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఎండ తీవ్రత కారణంగా బొగ్గు నిల్వల్లో వేడి పెరిగి ఈ మంటలు అంటుకున్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనతో కిలోమీటర్ల మేరకు నల్లని పొగ వ్యాపించింది, దీంతో పరిసర ప్రాంతాల ప్రజల్లో భయాందోళన నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే ఎలాంట్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టారు. పరిస్థితిని కంట్రోల్‌లోకి తెచ్చేందుకు అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారు. ఈ ఘటన కారణంగా విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## వడదెబ్బతో కొడుకు మృతి

**తట్టుకోలేక తల్లి మరణం**

**జోగులాంబ గద్వాల, ఏప్రిల్ 16 :** జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. అప్పటివరకు కళ్ళముందే తిరిగిన కొడుకు అనంతలో కాలకు వెళ్లగా.. ఆ వార్త విన్న తల్లి గుండె తట్టుకోలేకపోయింది. కొడుకు మరణించిన గంటల వ్యవధిలోనే తల్లి కూడా కన్నుమూసింది. ఈ ఘటన అయిజ మండలం తూముకుంట గ్రామాన్ని శోకసంద్రంలో ముంచేసింది. గ్రామానికి చెందిన కుర్వ మల్లికార్జున్ తీవ్రమైన వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయాడు. కంటిపాపలా పెంచుకున్న కొడుకు ఇక లేడన్న వార్త విన్న తల్లి కురువ రంగమ్మ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు మరణవార్తను ఆమె తట్టుకోలేక పోయింది. పుట్టెడు దుఃఖంతో ఆమె గుండె ఆగిపోయింది. ఒకే ఇంట్లో తల్లీకొడుకులు మృతి చెందడంతో తూముకుంట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేస్తోంది.

## పూడి శ్రీహరికి బెయిల్ మంజూరు

**కుప్పం, ఏప్రిల్ 16 :** అక్రమ కేసును బనాయించి అరెస్టు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరికి బెయిల్ మంజూరైంది. శ్రీహరికి కుప్పం కోర్టు బెయిల్ మంజూరు చేసింది, 33 గంటల పాటు అక్రమంగా నిర్బంధించిన తర్వాత కోర్టులో హాజరుపరిచిన పూడి శ్రీహరికి బెయిల్ మంజూరు చేసింది కుప్పం కోర్టు. బుధవారం పూడి శ్రీహరిని ఉదయం 8 గంటలకు అరెస్టు చేయగా, గురువారం, ఉదయమే వైద్య పరీక్షలు చేశారు.

## పార్లమెంట్ ఆమోదంతోనే తెలంగాణ ఏర్పాటు

**తేజస్విది మిడిమిడి జ్ఞానం అంటూ సింగిరెడ్డి విమర్శలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 16 :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తేజస్వీ సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్-భారత్ విభజనతో పోల్చడం దుర్మార్గమని విమర్శించారు. భారత రాజ్యాంగానికి లోబడి, పార్లమెంట్ ఆమోదంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అమరుల త్యాగాలు, ప్రజల ఆకాంక్షల ఫలితమని స్పష్టం చేశారు. దశాబ్దాల పోరాటం ఫలితంగా తెలంగాణ సాక్షాత్కరించిందని మాజీ మంత్రి చెప్పుకొచ్చారు. మిడిమిడి జ్ఞానం, అవగాహన లోపంతో బీజేపీ ఎంపీలు తెలంగాణ ఏర్పాటు మీద అవాకులు చెవాకులు పేలుతున్నారని మాజీ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా తెలంగాణ ఏర్పాటు పక్రియపై బీజేపీ దాడి చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ ప్రజల ఓట్లతో ఎంపీలుగా ఎన్నికైన 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు.. తేజస్వీ సూర్య వ్యాఖ్యలను ఖండించాలన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ విభజన విషయంలో చేసిన వ్యాఖ్యలకు బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య, బీజేపీ పార్టీ క్షమాపణ చెప్పాలని నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. మరోవైపు.. తెలంగాణపై తేజస్వి సూర్య దాడిని బీఆర్‌ఎస్ కూడా ఖండించింది. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగానికి అవమానం జరిగిందని ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ అన్నారు. తెలంగాణ ఎంపీలకు పౌరుషం ఉందా అని ప్రశ్నిస్తూ.. రాష్ట్రాన్ని అవమానిస్తుంటే ఢిల్లీలో ఊడిగం చేస్తున్నారా అని మండిపడ్డారు. 'ఢిల్లీలో డప్పు కొట్టే ఎంపీలకు తెలంగాణ ఆత్మగౌరవం పట్టదా? తేజస్వి సూర్య అజ్ఞానసూర్యుడు. బలిదానాల చరిత్ర తెలంగాణ.. అది నీ బుర్రకెక్కితేనే నోరు తెరువు. మొరిగే ఎంపీలని ఆపండి.. లేదంటే తెలంగాణ గడ్డపై బీజేపీకి అడుగుపెట్టే అర్హత లేదు' అని సూర్య ప్రసంగంపై ఘాటుగా స్పందించారు. అటు.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు కూడా ఎంపీ తేజస్వి వ్యాఖ్యలపై మండిపడ్డారు. పార్లమెంట్ సాక్షిగా అవమానం జరిగిందని.. తెలంగాణ ఏర్పాటును పాకిస్థాన్ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ సూర్య క్షమాపణలు చెప్పాలని హరీశ్ డిమాండ్ చేశారు.

## తేజస్వి ఎంపి సభ్యత్వం రద్దు చేయాలి

**మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్య**



**హైదరాబాద్, ఏప్రిల్ 16 :** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్‌పై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. తేజస్వి వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగించేలా ఉన్నాయని, వాటిని లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. అలాగే తేజస్వి లోక్‌సభ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయాలని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. 'తెలంగాణ డీఎన్‌ఏ ఉన్న ఎవరైనా తేజస్వి వ్యాఖ్యలను ఖండించాలి. ఈ విషయమై తెలంగాణ బీజేపీ ఎంపీలు ఎందుకు స్పందించడం లేదన్నారు. తేజస్వి సూర్య ఓ తెలివిలేని వ్యక్తి( అంటూ విమర్శలు గుప్పించారు.తెలంగాణ ఏర్పాటుపై ఇంత అజ్ఞానంగా మాట్లాడతారా? రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన రాష్ట్రాన్నే అవమానిస్తారా.? తేజస్వి రాజ్యాంగాన్ని కించపరిచేలా మాట్లాడారు. పోరాటం ద్వారా ఏర్పాటైన తెలంగాణను అవమానించారు' అని పొన్నం పేర్కొన్నారు.

## తెలంగాణలో తప్పులతడకగా బిసి గణన

**మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపణ**



**హైదరాబాద్, ఏప్రిల్ 16 :** తెలంగాణలో నిర్వహించిన కుల గణన గణాంకాలు పూర్తిగా తప్పుల తడకగా ఉన్నాయని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. బీసీల అసలు జనాభాను ఉద్దేశపూర్వకంగా తగ్గించి చూపిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 61 శాతం వరకు ఉన్న బీసీ జనాభాను తక్కువగా చూపిస్తూ వాస్తవాలను వక్రీకరించారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ను ఇప్పటివరకు అమలు చేయలేదని, కులాల వారీగా ఇచ్చిన హామీలు కూడా నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. బీసీలకు తగిన రిజర్వేషన్లు, నామినేటెడ్ పోస్టులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన అన్నారు. కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా కేవలం పదవులు ఇస్తున్నామంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీ కుటుంబాల వివరాలు సరిగ్గా సేకరించలేదనే కారణంతోనే తెలంగాణలో కుల గణన వివరాలు బయటపెట్టారని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ గణాంకాలు వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించడం లేదని స్పష్టం చేశారు. బీసీలకు న్యాయం జరగాలంటే ముందుగా కామారెడ్డి డిక్లరేషన్‌ను పూర్తిగా అమలు చేయాల్సిందేనని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి బీసీలకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు.

## తేజస్వి మాటలను భూతద్దంలో పెట్టీ చూడొద్దు

**బిఆర్‌ఎస్ నేతలకు బిజెపి నేత చురకలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 16 :** బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు స్పందించారు. సూర్య వ్యాఖ్యలపై అర్థంపర్థం లేకుండా బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతున్నారని అన్నారు. కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్టు బీఆర్‌ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని రామచంద్ర రావు మండిపడ్డారు. ఎంపీ సూర్య మాట్లాడిన దాంట్లో అంతరార్థం వేరని, బీఆర్‌ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తుందని అన్నారు. 'తేజస్వి మాటలను భూతద్దంలో పెట్టీ చూడొద్దు. ఆయన తెలంగాణను పాకిస్థాన్‌తో పోల్చలేదు. జేఏసీలో బీజేపీ భాగంగా ఉంది. బీజేపీ లేకుంటే తెలంగాణ వచ్చేదా. తెలంగాణ ఏర్పాటుపై లోక్‌సభలో జరిగిన చర్చ సమయంలో బీఆర్‌ఎస్ ఇద్దరు సభ్యులు లేరు. అదే సమయంలో రాష్ట్ర ఏర్పాటు ను కాంగ్రెస్ యూ టర్న్ తీసుకుంది. దీంతో అనేక మంది ఆత్మహత్య చేసుకున్నారు. వీరందరి ఆత్మహత్యలకు కాంగ్రెస్ పార్టీ కారణం కాదా. వాజపేయి చాలా సాఫీగా ఒక్క రక్తం చుక్క పడకుండా మూడు రాష్ట్రాలు ఇచ్చారు' అని రామచంద్ర రావు గుర్తు చేశారు.

# చట్టసభలు ఉన్నది కొందరి కోసమేనా?



**అంబేడ్కర్ మహాశయుడి జయంతి జరుపుకున్న మరుసటి రోజే..పార్లమెంటులో మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లులు చర్చకు వచ్చాయి. నిజానికి ఈ విషయంలో పాపం అంబేడ్కర్ గారు దూరదృష్టితో ఆలోచించి ఉంటే ఆనాడే ఈ అంశాలు రాజ్యాంగంలో ప్రస్తావనకు వచ్చేవి. కానీ ఆయన అందరినీ నమ్మి ఉంటారు. లేదా ఆయన ఆలోచనలను తొక్కిపెట్టి ఉంటారు. మహిళలకు ఆనాడే రిజర్వేషన్లు ప్రకటించి ఉంటే ఇవాళ ఇంతగా రాద్ధాంతం జరిగేది కాదు. ఇకపోతే బిల్లు ప్రవేశ పెట్టిన సందర్భంలో లోక్‌సభలో కేవలం 333 మంది మాత్రమే హాజరయ్యారు. మిగతా 210 మంది ఏమయ్యారన్నదే ప్రశ్న. చాలా ముఖ్యమైన బిల్లులు ప్రవేశ పెడతారని తెలిసీ ఈ 210 మంది లోక్‌సభకు రాకపోవడం తీవ్ర నేరంగా పరిగణించాలి. డివిజన్ జరిగితే కేవలం 333 మంది మాత్రమే లోక్‌సభలో ఉన్నట్లు లెకక తేలింది. ఇదొక అంశమమైతే.. కొన్ని విషయాలు విన్నప్పుడు తీవ్ర అభ్యంతరం కూడా వ్యక్తం అవుతోంది. ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా ఉండాలని సమాజ్‌వాది పార్టీ డిమాండ్ చేసింది. అంతేగాకుండా ఈ మహిళా బిల్లుకు తొందరెందుకని నిలదీసారు. బిల్లును గతంలోనే ప్రవేశ పెట్టారని, ఇప్పుడు మళ్లీ ప్రవేశ పెట్టడం ఎందుకని కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్ ప్రశ్నించారు. ఇవన్నీ చూస్తుంటే..అసలు మహిళా బిల్లు పట్ల ఎవరి ఆక్రోశం వారిదే అన్నట్లుగా సభలో వ్యవహారం కనిపించింది.**

ఇకపోతే పార్లమెంట్ తీరును చూస్తే ఈ బిల్లులపై చర్చ కన్నా, అసలు సభ్యుల ఎంపికపై చర్చ జరగాల్సి ఉంది. కొన్ని పార్టీలు మాఫియాలా తయరయ్యాయా అన్న అనుమానం కలుగుతోంది. పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలు వారి గుప్పిట్లోనే ఉంటున్నాయి. కొందరే నిరంతరం ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతున్నారు. ఇక కుటుంబాలకైతే వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఇలా కొందరి గుప్పిట్లో చట్టసభలు ఉండడం వల్ల చట్టసభల్లో అసవరమైన చర్చలు జరగడం లేదు. ప్రజా సమస్యలు ప్రస్తావనకు రావడం లేదు. లక్షల్లో జీతాలు,విలాసవంతమైన భవనాలు, సెక్యూరిటీ వంటి అదనపు అట్టహాసాలతో వీరే చట్టసభల్లో జీవితాంతం ఊరేగుతున్నారు. కాంగ్రెస్‌లో వారి పరివారమంతా చట్టసభల్లో ఉంది. సోనియా, రాహుల్, ప్రియాంక వంటి వారు ఒకే కుటుంబం నుంచి ఉన్నారు. ఎంఐఎంలో ఓవైసీ నిరంతరాయంగా ఎన్నికవుతున్నారు. అఖిలేశ్ యాదవ్ కటుంబం అటు యూపి అసెంబ్లీ, ఇటు పార్లమెంటులో తిష్ట వేసింది. మోడీ, అమిత్‌షాలు మూడు పర్యాయాలు ఇక్కడే ఉంటున్నారు. రాజ్‌నాథ్ సింగ్, గడ్కరీ ఇలా చెప్పకుంటూ పోతే అన్ని పార్టీలది ఒక్కటే లక్ష్యం. నిరంతరాయంగా చట్టసభల్లో తిష్టవేయడం. ఇలాంటి వారున్నంత కాలం చట్టసభల్లో ప్రజానుకూల చట్టాలు ఎలా వస్తాయి. మహిళల బిల్లు ఎందుకు పాస్ అవుతుంది. మహిళల పట్ల వీరికి ఎందుకు అనుకూలత ఉంటుంది. ఎందుకంటే తమ సీట్లకు ఎసరు వస్తుందేమో అన్న భావనలో అన్ని పార్టీల నేతలు ఉన్నారు. చట్టసభల్లో కొందరే గబ్బిలాల్లా పట్టుకుని వేలాడే పద్ధతి పోవాలి. ఒకరికి రెండు పర్యాయాలు మాత్రమే చట్టసభలో ఉండే అవకాశం ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న ఈ దేశంలో కొందరే చట్టసభల్లో నిరంతరంగా ఉండిపోయే కాలం పోవాలి. దీనిపై రాజ్యాంగ సవరణ జరగాలి. మోడీకి చిత్తశుద్ధ ఉంటే ఈ రకమైన చట్టసవరణకు పూనుకోవాలి. దీంతో చట్టసభలు ప్రక్షాళన జరుగుతాయి.

కొత్తతరం చట్టసభల్లోకి వస్తుంది. మహిళా రిజర్వేషన్లను ముందుకు తీసుకువెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించి ఆమోదించేందుకే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నారు. పనిలోపనిగా డీలిమిటేషన్ పక్రియను ముందస్తుగా అమలు పరచడం అంటే..2029 ఎన్నికల్లో అమలు చేయడం లక్ష్యంగా బిల్లు ప్రవేశ పెట్టారు. డీలిమిటేషన్‌తో దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సరిహద్దుల మార్పు జరుగనుంది. సీట్ల సంఖ్య పెరగునంది. 2029 లోక్‌సభ ఎన్నికలలో ఈ పునర్విభజన జరిగేలా చట్టం తీసుకుని వచ్చేందుకు కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి 'నారీ శక్తి వందన్ అధినియమ్' అమలును వేగవంతం చేసేందుకు ఉద్దేశించిన ఒక ముఖ్యమైన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించే లక్ష్యంతో మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అయ్యాయి. నిజానికి యూపిఎ పదేళ్ల కాలంలో మహిళా బిల్లును అటకెక్కించారు. కానీ వారు ఇప్పుడు మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. గతంలోనే ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. నిజంగానే గత ఎన్నికల్లోనే ఈ చట్టం అమలు చేసి ఉంటే పేచీ వచ్చేది కాదు. కానీ మోడీ ప్రభుత్వం తన రాజకీయాలను తాను ప్రదర్శిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనను 2029 సార్వత్రిక ఎన్నికలలోగానే పూర్తి చేసేందుకే చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపుదలకు మోదీ ప్రభుత్వం పూనుకున్నది. 2011 జనాభా గణన ఆధారంగా డీలిమిటేషన్ అమలును ఈ మహిళా రిజర్వేషన్‌తో ముడిపెట్టారు.

లోక్‌సభ సభ్యుల సంఖ్యను 543 నుంచి 816కు పెంచడం ద్వారా ప్రస్తుతం పురుషులు కలిగివున్న మొత్తం సీట్ల సంఖ్యను తగ్గించకుండానే 33 శాతం, అంటే ఇంచుమించు 273 సీట్లను మహిళలకు రిజర్వ్ చేసేందుకు నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి చేసేలా చట్టసవరణకు పూనుకున్నారు. అంటే మోడీ కూడా రాజకీయ ఎత్తుగడలతోనే ఉన్నారు. ఇలా చేయడం వల్ల పాతవారే ఎన్నికవుతారు. అలాగే కొందరి నియోజకవర్గాలు గల్లంతవుతాయి. అయితే మహిళలకు ఎప్పుడో చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కాల్సి ఉంది. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందనే మన చిరకాల నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనంగా నిలుస్తుంది. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ సందర్భం మన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైనది. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో మాత్రం అందరికీ ఏకాభిప్రాయం ఉన్నా, డీ లిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని సభలో సభ్యులు వ్యతిరేకిస్తు న్నారు. అయితే అలా చేయకుంటే ఇప్పుడున్న సీట్లతోనే మహిళలకు సీట్లు సర్దుబాటు చేయడానికి ఏ రాజకీయ పార్టీ సిద్ధంగా లేదు. ఇదంతా ఒక ఎత్తయితే చట్టసభలో సభ్యుల పదవీకాలాన్ని నిర్దేశించాలి. ఎన్ని పర్యాయాలు ఎంపిలుగా ఉండాలో, ఎమ్మెల్యే లుగా ఉండాలో నిర్ణయించాలి. కొందరే నిరంతరాయంగా చట్టసభలకు పరిమితం అయ్యే విధానం పోవాలి. ఇది జరిగితే తప్ప భారతప్రజాస్వామ్యానికి అర్థం లేదు.

# నిప్పుల కొలిమి



- రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత
- భానుడి భగభగలతోఇంటికే పరిమితం అయిన జనం
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 16 :** ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కొలిమిగా మారాయి. గత నెల రోజులుగా ఆయా ప్రాంతాల్లో విభిన్న వాతావరణం చోటు చేసుకుంది. కొన్నిచోట్ల అకాల వర్షాలు, పలుచోట్ల వడగళ్ల వర్షం, చూసాం. ఇప్పుడు ఉన్నట్టుండి వడగాడ్పులు చప్పుడు వింటున్నాం. భానుడి భగభగలతో జనం మిట్ట మధ్యాహ్నం బయటకు వెళ్ళ లేక ఉన్న చోటనే ఇంట్లోనో, కార్యాలయంలోనో ఉండిపోతున్నారు. తెలంగాణలో అన్ని జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలోఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. రానున్న మూడు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపి ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం అవకాశం ఉందని పేర్కొంది. కొన్ని ప్రాంతాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ఎండ వేడిమి నుండి తట్టుకోలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇప్పటికే రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. ఏప్రిల్ 19 నుంచి మే 31 వరకు ప్రత్యేక వాతావరణం చూస్తామని ఈ కారణంగా కొన్ని కఠినమైన పరిస్థితులు ఎదురవుతా యని వాతావరణ శాఖ అలర్ట్ చేసింది. వడగాలులు సాధారణ రోజుల కన్నా ఎక్కువ ప్రభావం చూపుతాయి.

### కోస్తా జిల్లాల్లో వడగాలు

ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతమైన కోస్తా జిల్లాల్లో వడగాలు పలు ప్రభావం నుంచి బయటపడే ఆలోచన చేయాల్సి ఉంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో కనీసం ఐదుగురు వడగాల్పులకు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఉష్ణోగ్రత 45 డిగ్రీల నుండి 55 డిగ్రీల వరకు అత్యధిక వేడిమి ఉంటుందనే హెచ్చరికల నేపథ్యంలో డాక్టర్లు, శాస్త్రజ్ఞులు సైతం మానవ సహిత జీవజాలాన్ని, జంతు జాలాన్ని వేడివాతావరణంలో ఎలా రక్షించుకోవాలో, సూచిస్తున్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ఎవరూ బయటకు వెళ్లకూడదని వాతావరణశాఖ హెచ్చరించింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉక్కపోత అధికం గా ఉంటుందని, గాలిలో తేమ శాతం తగ్గిపోవడం వల్ల వడ దెబ్బ తగిలే అవకాశం ఉంది. వేసవి ఉష్ణోగ్రతలు 35డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఉన్నప్పుడు బయట ఎక్కువసేపు తిరిగే వారిలో డీహైడ్రేషన్, తలనొప్పి, తల తిరగడంవంటి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయి. ఎండల ధాటి 40-45 డిగ్రీలకు చేరుకుంటే, ప్రమాద స్థాయి మరింతగా పెరుగుతుంది. గడచిన పదేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో సగటు గరిష్టఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే ఎక్కువగానే నమోదవుతున్నాయి.విజయవాడ, కర్నూలు, రామగుండం, భద్రాచలం వంటి కొన్ని ప్రాంతాల్లో వేసవి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45-47డిగ్రీల వరకు కూడా నమోదవుతున్నాయి. అందువల్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను తాకినప్పటి నుంచి తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించడం మంచిది. ఎల్నినో కాస్త ముందే పలుకరించినా భూమధ్య రేఖ వెంబడి పసిఫిక్ మహా సముద్రం వేడెక్కుతుంది. చివరిసరిగా ఎల్నినో పరిస్థితులు 2023 లో ఏర్పడ్డాయి. ఈ ఏడాదిరుతుపవనాల సమయంలో అ త్యల్ప వర్షపాతం నమోదవుతుందని వాతావరణశాఖ చెబుతోంది. ఎల్నినో ప్రభావంతో దేశంలో నీటి వనరులకు కొరత ఏర్పడుతుంది.

## దేశాన్ని నిర్మించే దిశగా శక్తి స్ఫూర్తితో సాగాలి

### మహిళా బిల్లు నేపథ్యంలో పవన్ కళ్యాణ్ పోస్ట్

**అమరావతి, ఏప్రిల్ 16 :** భారతదేశం ఈరోజు నారీ శక్తిని గౌరవిస్తూ దేశంలోని మహిళలు వివిధ రంగాల్లో సాధిస్తున్న అసాధారణ విజయాలను వేడుక చేసుకుంటోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లును కేంద్రం ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో పవన్ ఎక్స్ వేదికగా స్పందించారు. చెస్ బోర్డు నుంచి ఒలింపిక్ పోడియం వరకు భారతీయ మహిళలు దేశానికి స్ఫూర్తిని అందిస్తున్నారని తెలిపారు. ఇటీవల సైప్రస్‌లో జరిగిన మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో ఆర్.వైశాలి చరిత్ర సృష్టించారని అన్నారు. ఈ టోర్నమెంట్ గెలుచుకుని, మహిళల ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో పోటీపడే అర్హత సాధించిన తొలి భారతీయ మహిళగా నిలిచారన్నారు. ఈ విజయం భారత మహిళల ప్రపంచ స్థాయి ప్రతిభను మరోసారి నిరూపించిందన్నారు. గౌరవనీయ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీ బలోపేతం చేసిన పరిపాలన, ప్రజా సేవ నుంచి నారీ శక్తి ప్రయాణం.. భారత అంతరిక్ష యాత్రల్లో రితు కరిధాల్ ప్రదర్శించిన శాస్త్రీయ నైపుణ్యం వరకు విస్తరించిందన్నారు. అలాగే ప్రపంచ బాక్సింగ్ వేదికపై ఆధిపత్యం చెలాయించి దేశ గౌరవాన్ని నిలబెట్టిన నిఖత్ జరీన్ క్రీడా నైపుణ్యం కూడా.. ఈ సాధికారత ప్రయాణం భారతదేశ రాజ్యాంగ పునాదులలో లోతుగా పాతుకుపోయిందని చెప్పారు. దాక్షాయణి వేలాయుధన్, హంసా మెహతా, దుర్గాబాయి దేశ్‌ముఖ్, విజయలక్ష్మి పండిట్, రాజకుమారి అమృత్ కౌర్ వంటి రాజ్యాంగ వ్యవస్థాపక మాతృమూర్తులు ఈ పునాదులను తీర్చిదిద్దారన్నారు. వారి కృషి తరతరాల భారతీయ మహిళలకు న్యాయం, సమానత్వాన్ని అందించిందని పవన్ పేర్కొన్నారు. ప్రతిభకు అవకాశం లభిస్తే మహిళలు నాయకత్వం వహిస్తారని, రాణిస్తారని, దేశాలకు స్ఫూర్తినిస్తారని చరిత్ర చెబుతోందని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ స్ఫూర్తితోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 'నారీ శక్తి వందన అధినియమ్' సవరణ బిల్లు 2026ను ప్రవేశపెట్టారని తెలిపారు. శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా పరిపాలనలో వారికి న్యాయమైన స్థానం కల్పించే దిశగా ఇది



చరిత్రాత్మక అడుగుగా నిలుస్తుందన్నారు. జనసేన పార్టీ మహిళా సాధికారత కోసం కేవలం మాటలతో కాకుండా చేతలతో ఎప్పుడూ దృఢంగా నిలబడిందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో చేసిన వాగ్దానం మేరకు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే నిబద్ధత, సమాన అవకాశాలు, న్యాయంమైన ప్రాతినిధ్యం పట్ల జనసేనకు ఉన్న నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తుందని తెలిపారు. మహిళలే సమాజా నికి పునాది అని... కుటుంబాలను పోషించడం నుంచి దేశాన్ని తీర్చిదిద్దడం వరకు వారి పాత్రకు ప్రత్యామ్నాయం లేదని అన్నారు. ఒక మహిళ ఉన్నత స్థాయికి ఎదిగితే దేశం కూడా ఉన్నత స్థాయికి ఎదుగుతుందని అభిప్రాయపడ్డారు. ఇది కొత్త హక్కులు ప్రసాదించడం కాదని.. మహిళలకు న్యాయబద్ధంగా చెందాల్సిన వాటిని పునరుద్ధరించడమే అని స్పష్టం చేశారు. బలమైన మహిళలు బలమైన కుటుంబాలను, బలమైన కుటుంబాలు బలమైన దేశాన్ని నిర్మిస్తాయన్నారు. ఇకపై 'నారీ శక్తి' కేవలం నినాదంగా మిగిలిపోదని.. అది మన నాగరికతకు బలమైన శక్తిగా నిలుస్తుందన్నారు. న్యాయబద్ధమైన, సమానమైన, సాధికారత కలిగిన భారతదేశాన్ని నిర్మించే దిశగా 'శక్తి' స్ఫూర్తితో ముందుకు సాగాలి అంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## విపక్షాల ఐక్యతకు పరీక్షా కాలం

**మహిళా బిల్లుపై పరస్పర విరుద్ధ వాదనలు**

**ఎన్నికల ప్రచారంలో బిజీగా టిఎంసి ఎంపిలు**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 :** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లుల నేపథ్యంలో విపక్ష కూటమిలో విభేదాలు బయటపడుతున్నట్టు తెలుస్తోంది. అలాగే వారి మధ్య ఐక్యత లేదని స్పష్టం అవుతోంది. బిల్లును వ్యతిరేకిస్తే తమకు పుట్టగతులు ఉండవన్న భయం కూడా వారిని వెన్నాడుతోంది. పార్లమెంట్‌లో ఈ కీలక బిల్లులపై ఓటింగ్‌కు ముందు జరిగిన సమావేశంలో వివిధ పార్టీలు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేయడమే దీనికి కారణం. కేంద్రం తీసుకొస్తున్న ఈ బిల్లుల ద్వారా లోక్‌సభ, అసెంబ్లీలలో మహిళలకు రిజర్వేషన్ అమలును వేగవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే.. ఈ పక్రియను డీలిమిటేషన్‌తో అనుసంధానం చేయడంపై విపక్ష నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ బెంగాల్లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు అందరూ పార్లమెంట్‌కు హాజరుకావడం కష్టమవుతోందని ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యురాలు సాగరికా ఘోష్ తెలిపారు. అయితే.. టీఎంసీ వైఖరిని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుపట్టారు. విపక్ష ఎంపీలు ఓటింగ్‌కు హాజరు కాకపోతే అది ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినట్లే అవుతుందని హెచ్చరించినట్టు సమాచారం. అన్ని పార్టీలు తప్పనిసరిగా హాజరై బిల్లును వ్యతిరేకించాలని ఆయన కోరారు. ఇదిలా ఉండగా.. తమిళనాడులోనూ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నప్పటికీ డీఎంకే ఎంపీలు పూర్తి స్థాయిలో హాజరవుతారని ఆ పార్టీ ప్రతినిధి టీఆర్.బాలు స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము వ్యతిరేకం కాదని కొందరు విపక్ష నేతలు ఇప్పటికే తమ అభిప్రాయాలను వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఏది ఏమైనా మహిళా రిజర్వేషన్ బిల్లు రాజకీయంగా కొత్త సమీకరణాలకు దారితీస్తుండగా.. విపక్ష ఐక్యతకు ఇది పరీక్ష కాలంగా మారింది. మహిళల రిజర్వేషన్ల అమలు, నియోజకవర్గ పునర్విభజన బిల్లులపై కాంగ్రెస్ నేత సోనియా గాంధీ తాజాగా స్పందించారు. మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు స్పందిస్తూ తమ పార్టీ వైఖరిని ముందే తెలియజేశామని అన్నారు. ఈ విషయంలో అదనంగా తాను చెప్పాల్సిందేమీ లేదని పేర్కొన్నారు.ఇందుకు సంబంధించిన బిల్లులను గురువారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్‌వాల్, హోం మంత్రి అమిత్‌షా లోక్‌సభ ముందుకు తీసుకొచ్చారు.

## బోట్లు తయారీ కంపెనీని తరిమేస్తారా

**పెట్టుబడులు వస్తే తట్టుకోరా జగన్ గారూ**

**ఇదేం రాక్షస మనస్తత్వమో : మంత్రి లోకేశ్**

**అమరావతి, ఏప్రిల్ 16 :** దేశ రక్షణకు అధునాతన బోట్లు తయారు చేసే కంపెనీ రాష్ట్రానికి వస్తే స్వాగతించాల్సింది పోయి.. తరిమేస్తానని జగన్ అనడమేంటని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. ఇదేం రాక్షస మనస్తత్వమని అన్నారు. మత్స్యకారుల పిల్లలకు ఉద్యోగాలు వస్తాయంటే.. ఆనందించాల్సింది పోయి, అడ్డుకుంటాననడం ముమ్మాటికీ సైకోయిజమేనని వ్యాఖ్యానించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. తల్లిని తరిమేసి, చెల్లిని గెంటేసిన జగన్‌కు దైవం అంటే భక్తి లేదు.దేశం అంటే ద్వేషం. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ఉద్యోగాలు వస్తున్నాయంటే దోపిడీ అని గగ్గోలు పెడుతున్నారు. నిలువెల్లా స్వార్థం, మనసంతా విధ్వంసం నిండి ఉన్నాయి. అమరావతిని మార్చేస్తాం.. కట్టినవన్నీ కూల్చేసి, కంపెనీలన్నీ వెళ్లగొడతామంటున్నారు. జగన్ మోహన్‌రెడ్డి సర్.. ఇవేం రాక్షస చేష్టలు అని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాలు వస్తాయంటే ఉసూరుమంటూ ఏడుస్తారని వ్యంగ్యంగా అన్నారు. రప్పా.. రప్పా నరుకుతాం.. అమరావతిని మార్చేస్తాం.. కట్టినవన్నీ కూల్చేస్తాం.. ఏమిటీ దుర్మార్గ పనులు జగన్‌రెడ్డి? అంటూ వైసీపీ అధినేతను మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా సూటిగా నిలదీశారు. దేశ రక్షణకు అధునాతన బోట్ల తయారీ కంపెనీ రాష్ట్రానికి వస్తే.. స్వాగతించాల్సింది పోయి తిరిమేస్తానంటారా? ఇదేం రాక్షస మనస్తత్వం? అంటూ జగన్ వైఖరిని మంత్రి లోకేశ్ ఎండగట్టారు. మత్స్యకారుల పిల్లలకు వెయ్యికిపైగా ఉద్యోగాలు వస్తాయంటే.. ఆనందించాల్సింది పోయి అడ్డుకుంటామనడం సైకోయిజమే అవుతుందంటూ జగన్ వ్యక్తిత్వాన్ని మంత్రి లోకేశ్ వివరించారు.

## మంత్రాలయం ప్రమాద ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి

**మృతుల కుటుంబాలకు 2లక్షల పరిహారం ప్రకటన**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 :** కర్నూలు జిల్లాలోని మంత్రాలయం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతితి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలతోపాటు క్షతగాత్రులకు ఆయన నష్ట పరిహారాన్ని ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేలు చొప్పున నష్టపరిహారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఈ నష్ట పరిహారాన్ని అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రధాని మోదీ స్పందించారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, బాలికలు ఉన్నారు. వీరంతా కర్ణాటకలోని చిక్‌మంగళూరు వాసులని జిల్లా ఉన్నతాధికారులు తెలిపారు. ఘటనపై ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

### బాధితులను పరామర్శించిన కలెక్టర్

కర్నూలు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోడ్డు ప్రమాద బాధితులను జిల్లా కలెక్టర్ సిరి పరామర్శించారు. ఈ ప్రమాదంలో గాయపడి.. ఎమ్మిగనూరు ఆసుపత్రిలో చికిత్స పొందిన నలుగురు క్షతగాత్రులు డిశార్చ్ అయ్యారన్నారు. మిగిలిన వారు.. కర్నూలు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. మంత్రాలయం మండలం చిలకలడోన సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం జరిగిన స్థలాన్ని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు.



## ఎన్నికల ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో
# కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**టిఆర్‌విఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొనార్ దుర్గాప్రసాద్**

**జవహర్‌నగర్, నేడు న్యూస్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని టి ఆర్ వి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనార్ దుర్గాప్రసాద్ ఆరోపించారు. గురువారం జవహర్ నగర్ లోని సూర్య నగర్ లో తెలంగాణ వికలాంగుల రాష్ట్ర సమితి సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి టి ఆర్ వి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మహమ్మద్ మున్న, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ షేక్ నయీమ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల హక్కుల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఎన్నికల ముందు దివ్యాంగులకు 6000 పెన్షన్ ఇస్తామన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం దివ్యాంగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేనిపక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం టి ఆర్ వి ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సుతారి రమేష్ ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు.



# ఆర్థిక సాయం అందజేత

**వలిగొండ, నేడు న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం దాసిరెడ్డి గూడెం వాస్తవ్యులు పాలోజు నరసింహ చారి అనారోగ్యంతో చనిపోవడం జరిగింది వారి కుటుంబ సభ్యులకు దాసిరెడ్డిగూడెం బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రూ. 10000 ఆర్థిక సాయం చేయడం జరిగింది అదేవిధంగా దాసి రెడ్డిగూడెం గ్రామ మాజీ సర్పంచ్ కొమురెల్లి సరిత సంజీవరెడ్డి 50 కేజీల బియ్యం గూడూరు శేఖర్ రెడ్డి 25 కేజీల బియ్యం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో దాసిరెడ్డి గూడెం బి ఆర్ ఎస్ పార్టీ సర్పంచ్ రాపోలు గోపి బి ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు దంతూరి నరేష్ కుమార్ సీనియర్ నాయకులు కునపురి శ్రీశైలం, పాశం పిచ్చిరెడ్డి, దంతూరి యాదయ్య, నారి సత్తయ్య, పాలోజు బ్రహ్మాచారి, రావుల చిన్న పద్మా రెడ్డి, రాపోలు నరేష్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## టీఎన్జీవో ఆఫీస్ కాంపౌండ్ కూల్చివేతకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి

**సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన టీఎన్జీవో నాయకులు**

**మేడ్చల్, నేడు బ్యూరో:** టీఎన్జీవో మేడ్చల్ కార్యాలయ కాంపౌండ్ గోడను కూల్చి వేసి లోనికి సొచ్చుకుని వచ్చి కబ్జాకు ప్రయత్నం చేసిన ప్రైవేట్ వ్యక్తులపై టీఎన్జీవో సంఘం నాయకులు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. కాంపౌండ్ వాల్ కూల్చివేతకు బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు తమ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ విషయంపై పోలీస్ కమిషనర్ సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి నట్టు టీ. ఎన్.జీ. వో సంఘం నాయకులు మీడియాకు వివరాలు విడుదల చేస్తూ ప్రకటించారు. పోలీస్ లకు ఫిర్యాదు చేసిన వారిలో టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మారాం జగదీశ్వర్, సయ్యద్ ముజీబ్ హుస్సైనీ, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కస్తూరి వెంకటేశ్వర్లు, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షులు బి. రవి ప్రకాష్, కార్యదర్శి బి. భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసిన సర్పంచ్

**దేవరుప్పుల నేడు న్యూస్ :** తెలంగాణ రాష్ట్రంలో రోజురోజుకు ఎండలు పెరిగిపోతుం డడంతో ఎండ తీవ్రత దృష్ట్యా ఎండలో పనిచేసే ఉపాధి హామీ కూలీలు వడదెబ్బకు గురికాకుండా దేవరుప్పుల మండలం,చిన్న మాడుర్ గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు స్థానిక సర్పంచ్ మైదం జోగేశ్వర్ ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్,ఆశ కార్యకర్తలతో కలిసి ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు.

## ఆధార్ బేస్డ్ అటెండెన్స్‌ను తప్పనిసరిగా
# సమయానికి నమోదు చేయాలి

- లేదంటే చర్యలు తప్పవు
- మెడికల్ ఆఫీసర్ల సమీక్షా సమావేశం లో
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్: ఉమా గౌరి హెచ్చరిక



**మేడ్చల్, నేడు బ్యూరో:** ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్ తప్పనిసరిగా సమయానికి నమోదు చేసి, సంబంధిత గ్రూపులో పోస్టు చేయాలని, లేని యెడల కఠిన చర్యలు తప్పవని మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్: సి. ఉమాగౌరి మెడికల్ ఆఫీసర్స్ ను హెచ్చరించారు. మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లతో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాతృ ఆరోగ్యం, పోషణ, కుటుంబ నియంత్రణ, టీకాలు, సంక్రమణ, అసంక్రమణ వ్యాధులు, వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతి, సిబ్బంది వివరాలు, ఖాళీలు, ఔషధాల నిల్వలు, బ్యాంక్ ఖాతాల నిర్వహణ, పెండింగ్ బిల్లులు, కాయకల్ప కార్యక్రమం తదితర ముఖ్య అంశాలపై సంబంధిత ప్రోగ్రామ్ అధికారుల సమక్షంలో సమగ్ర సమీక్ష చేశారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్: సి. ఉమాగౌరి మాట్లాడుతూ, ప్రతి ఆరోగ్య కేంద్రంలో అవసరమైన ప్రాథమిక మందులు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. గడువు ముగిసే సమీపంలో ఉన్న మందుల కోసం ప్రత్యేక కార్నర్ ఏర్పాటు చేయాలని, గడువు ముగిసిన మందులను నిబంధనల ప్రకారం డిస్పోస్ చేయవలసిందిగా ఆదేశించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ప్రాథమిక కేంద్రం అప్డేటెడ్ ఈ.డీ.డీ క్యాలెండర్‌ను ప్రదర్శించాలని, చిన్నపిల్లల టీకా కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం కచ్చితంగా నిర్వహించాలని డీ.ఎం. అండ్ హెచ్.వో ఆదేశించారు. గర్భిణీ స్త్రీల సేవలు, ముఖ్యంగా రక్తహీనత, హై రిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రసవ సేవలను జాగ్రత్తగా నిర్వహించడం ద్వారా మాతృ మరణాలు నివారించాలన్నారు. టీబీ, ఎన్.సి.డి సంబంధిత రోజు వారీ సేవలను నిర్లక్ష్యం చేయరాదని, ప్రతి ఆరోగ్య కేంద్రం కనీస ప్రమాణాలను పాటిస్తూ అవసరమైన పరికరాలు, మందులు అందుబాటులో ఉంచాలని, అవసరమైతే జిల్లా అధికారులను సంప్రదించాలని కోరారు. అలాగే, జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల వివరాల కోసం సర్వే నిర్వహించి, ఒక నెలలోపు నివేదికను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా డిప్యూటీ డీ.ఎం అండ్ హెచ్.వోలు, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్: శ్రీదేవి, డాక్టర్: గీతా, డాక్టర్: చంద్రకళ, డాక్టర్: లావణ్య, డాక్టర్: కౌశిక్, డిప్యూటీ డెమో వసంత కుమారి, జిల్లా క్వాలిటీ మేనేజర్ సురేష్, జిల్లాలోని అన్ని పీ హెచ్.సీ లు, యు.పీ.హెచ్సీల మెడికల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.



# బస్ షెల్టర్లు ఏర్పాటు చేయండి

- ఉప్పల్ బస్ డిపో మేనేజర్‌ను కోరిన తుంగతుర్తి రవి
- బస్ డిపో మేనేజర్ కు వినతి పత్రం అందజేసిన తుంగతుర్తి రవి



**మేడిపల్లి, నేడు న్యూస్:** ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించి బస్సు షెల్టర్లను ఏర్పాటు చేయాలని పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి కోరారు. ఈ మేరకు ఉప్పల్ బస్ డిపో మేనేజర్ శ్రీనివాస్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. బస్సు షెల్టర్ల ఆవశ్యకతను డిపో మేనేజర్ శ్రీనివాస్‌కు తుంగతుర్తి రవి వివరించారు. అనంతరం తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి, పీర్జాదిగూడ పరిధిలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వరంగల్ హైవేలోని బస్సు స్టాప్ ల వద్ద ప్రయాణికులు బస్ షెల్టర్లు లేకపోవడంతో వారి బాధలు వర్ణనాతీతమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు షెల్టర్లు లేక గంటలతరబడి ప్రయాణికు లు ఎండలో నిల్చోవాల్సి వస్తుందని అన్నారు. దీంతో ప్రయాణి కులు వడదెబ్బతలిగి ఆసుపత్రుల పాలవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల సౌక ర్యార్థం వడదెబ్బలకు గురి కాకుండా బస్ షెల్టర్లను వెంటనే ఏర్పాటు చేయాలని ఉప్పల్ డిపో మేనేజర్ శ్రీనివాస్ కు విజ్ఞప్తి చేశారు. అలాగే తాత్కాలికంగా ఆర్.వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉప్పల్ డిపో బస్టాప్ వద్ద షెల్టర్ ఏర్పాటు చేయనున్నట్లు తుంగతుర్తి రవి వెల్లడించారు. మేడిపల్లి, పీర్జాదిగూడ రెండు డివిజన్‌ల పరిధిలో శిధిలావస్థలో ఉన్న బస్టాప్ లను పునర్ని ర్మించాలని, ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న చోట నూతన బస్టాప్‌లను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కవిడె కుమార్, సోమయ్య, నాగరాజు, శరత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌ను సత్కరించిన ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

**మేడ్చల్, నేడు బ్యూరో:** మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలం అంతాయపల్లిలోని ఎస్.ఎన్.ఆర్ ఫంక్షన్ హాల్ లో గురువారం టియుడబ్ల్యూజే రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి మర్యాద పూర్వకంగా విచ్చేసిన మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్ ను ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి శాలువా కప్పి, మెమెంటో అందించి సత్కరించారు. జిల్లా ఆర్.టీ.ఏ మెంబర్ జయపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీష కృష్ణారెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, అలియాబాద్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు తుంకి రమేష్ లు శ్రీనివాస్ రెడ్డిని కలుసుకున్న వారిలో ఉన్నారు.



## సింగరేణి గ్రామపంచాయతీకి బకాయిల చెల్లింపులకు శ్రీకారం

**కారేపల్లి, నేడు న్యూస్:** సింగరేణి మండలంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి గ్రామపంచాయతీకి చెల్లించవలసిన బకాయిల చెల్లింపులకు శ్రీకారం చుట్టబడింది. కారేపల్లి సంతకు సంబంధించిన మొత్తం రూ.2 లక్షల బకాయిలో భాగంగా, మొదటి విడతగా రూ.1 లక్షను గురువారం చెక్కు రూపంలో గ్రామపంచాయతీకి అందజేశారు. ఈ చెక్కును దేవస్థానం ప్రతినిధి మూడ్ మోహన్ చౌహన్, గ్రామపంచాయతీ సర్పంచ్ మేదరి వీరప్రతాప్, పంచాయతీ కార్యదర్శి నెహ్రుకు అధికారికంగా అందించారు. మిగిలిన బకాయిని కూడా త్వరలోనే చెల్లిస్తామని దేవస్థానం ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేదరి వీరప్రతాప్ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు సమయానికి అందడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. దేవస్థానం నుంచి బకాయిల చెల్లింపులు ప్రారంభం కావడం సంతోషకరమని, మిగిలిన మొత్తాన్ని కూడా త్వరితగతిన చెల్లించాలని కోరారు. గ్రామస్తులు కూడా దేవస్థానం తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, మిగిలిన బకాయిలను త్వరగా చెల్లించాలని కోరుతున్నారు. ఈ నిధులు గ్రామ అభివృద్ధికి మరింత ఊతమివ్వనున్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికపై సమీక్ష



**వలిగొండ, నేడు న్యూస్ :** వలిగొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈరోజు తెలంగాణ ప్రభుత్వం మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం మార్చి 6వ తేదీ నుండి 99 రోజులపాటు గ్రామ స్థాయి నుండి మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అన్ని శాఖల సమన్వయంతో, అర్హులైన లబ్ధిదారులకు అందరికీ ప్రభుత్వం అందించే పథకాలు అందినాయని మరియు ఒకవేళ ఎవరైనా పొందనియెడల వారికి కూడా తప్పకుండా అమలు చేయాలని నిర్ణయించబడింది. ఈ సమావేశంలో ప్రభుత్వ ఏర్పాటైన నాటి నుండి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పురోగతిపై ప్రతి శాఖాధికారులు తమ నివేదికలను సమర్పించారు. గ్రామ సర్పంచులు లేవనెత్తిన ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి జగన్నాథ్ రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలందర్ రెడ్డి, మండల రెవెన్యూ అధికారి దశరథ్ నాయక్, మండల విద్యా అధికారి భాస్కర్, మండల పంచాయతీ అధికారి వై. ప్రేమలత, వ్యవసాయ అధికారి అంజని దేవి, వైద్య శాఖకు చెందిన డా. వేణు మాధవి, డా. జ్యోతి, డా. ఖాజా, విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ నర్సింహ, పంచాయతీ రాజ్ శాఖ సహాయ ఇంజనీర్ సందీప్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమ్య, ఐకేపీ అసోసియేట్ ప్రాజెక్ట్ మేనేజర్ అంజయ్య, హౌసింగ్ శాఖ ఏఈ కిరణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామ పంచాయతీ సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మీడియా ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## ఆర్ఎంపీ, పీఎంపీలను తనిఖీలు చేసిన
# దొంగ డాక్టర్ ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు

**దేవరుప్పుల నేడు న్యూస్ :** ఆర్ఎంపీ,పీఎంపీలను తనిఖీలు చేసిన దొంగ డాక్టర్ ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు పాలకుర్తి సీఐ వి.జానకిరామిరెడ్డి బుధవారం రాత్రి దేవరుప్పుల మండల పోలీస్ స్టేషన్ లో ఎస్సై ఊర సృజన్ కుమార్ తో కలిసి ముఠాసభ్యులు ఐదుగురిని చూపించి వివరాలు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా డాక్టర్ సెల్ మెడికల్‌డహెల్త్ వింగ్ విభాగానికి చేర్యాలలో అక్షర హాస్పిటల్ ను నిర్వహిస్తున్న డాక్టర్.ఎడెల్లి సంతోష్ కుమార్ ను జనగామ జిల్లా చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీ నియమించింది. అయితే జనగామ జిల్లా వ్యాప్తంగా కమిటీ వేసి 44 మందిని సంతోష్ కుమార్ నియమించుకున్నాడు. అందులో యాక్టివ్ గా ఉన్న ఇంతకుముందు అతని వద్ద పనిచేసిన సింగపాక మనోజ్ అనే వ్యక్తిని వైస్ చైర్మన్ గా నియమించారు. సంఘీ నాగరాజు (బంజర-దేవరుప్పుల),కందుకూరి హరీశ్ (జనగామ),రంగు భానుచందర్ (తమ్మడపల్లి-బచ్చన్నపేట),ఉప్పల అనిల్ (దేవరుప్పుల)ను సభ్యులుగా నియమించారు. డాక్టర్స్ సెల్ విభాగంలో పనిచేస్తే మీకు భవిష్యత్ ఉంటుందని వారికి చెప్పారు. మీరు ప్రభుత్వ,ప్రైవేట్ హాస్పిటల్,ఆర్ఎంపీ,పీఎంపీ క్లినిక్ ల్లో తనిఖీలు చేపట్టి అందులో ఏమైనా లోపాలుంటే అక్కడ పంచనామా రాసి కేసు అవుతుందని బయపెట్టాలని చెప్పాడు. దీంతో కమిటీ సభ్యులు డబ్బులకు ఆశపడి జనగామలో ఓ ఆర్ఎంపీ ఇంజెక్షన్ ఇవ్వడం వల్ల ఓ వ్యక్తి చనిపోగా అతడి వద్దకు వెళ్లి బెదిరించారు. దీంతో సదరు ఆర్ఎంపీ కుమారుడు రూ. 30 వేలు ఇచ్చాడు. అందులో నుంచి రూ. 4వేలు డాక్టర్ సంతోష్ కుమార్ చెప్పిన నెంబర్ కు గూగుల్ పే ద్వారా మనోజ్ పంపారు. మిగతా డబ్బులు వారు సమానంగా పంచుకున్నారు. ఇలా పలుచోట్ల అక్రమాలకు పాల్పడ్డారు. ఈ విషయమై దేవరుప్పుల,జనగామ పీఎస్ లో కేసులు నమోదయ్యాయి. ఈ విషయంమై పోలీసులు గాలింపు చర్యలు చేపట్టాగా బుధవారం రెండు కార్లలో దేవరుప్పుల వైపు వస్తుండగా ఐదుగురిని అరెస్ట్ చేసి రెండు కార్లతోపాటు ఐదు సెల్ఫోన్లు,రూ. 43 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కాగా కందుకూరి హరీశ్ పరారీలో ఉన్నట్లు వివరించారు. అరెస్టు అయిన డాక్టర్ సంతోష్ కుమార్ తోపాటు నలుగురు ల్యాబ్ టెక్నీషియన్లను జనగామ కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ అయినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.







## ఉప్పల్ ప్రెస్ క్లబ్ డైరీ ఆవిష్కరణకు పరమేశ్వర్ రెడ్డి, ఏసీపీ వెంకట్ రెడ్డికి ఆహ్వానం

**ఉప్పల్, నేడు న్యూస్:** ఉప్పల్ ప్రెస్ క్లబ్ (ప్రింట్ అలాగే ఎలక్ట్రానిక్ మీడియా) ఆధ్వర్యంలో డైరీ ఆవిష్కరణ కార్యక్రమం ఈనెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు ఉప్పల్ భగాయత్‌లోని శ్రీరస్తు కన్వెన్షన్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డిని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్ నాయకత్వంలో ప్రతినిధులు ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రింట్ అలాగే ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ప్రెస్ క్లబ్ చేపట్టే కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఉప్పల్ ప్రాంత చరిత్రలో తొలిసారిగా ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసి డైరీ ఆవిష్కరించడం అభినందనీయమని చెప్పారు. క్లబ్‌కు అన్ని వర్గాల మద్దతు లభించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, మల్కాజ్గిరి ఏసీపీ వెంకట్ రెడ్డిని కూడా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కలిసి డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.




## నందిని సిద్ధారెడ్డిని సత్కరించిన టీయూడబ్ల్యూజే

**మేడ్చల్ నేడు బ్యూరో:** కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నందిని సిద్ధారెడ్డిని టియూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గం ఘనంగా సత్కరించింది. గురువారం మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలం అంతాయిపల్లిలోని ఎస్.ఎన్.ఆర్ ఫంక్షన్ హాల్లో టి.యు.డబ్ల్యూ.జే రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులో ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐ.జే.యు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపెల్లి అమర్, టి.యు.డ.డబ్ల్యూ.జె రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విరాహత్ అలీ, రామ్ నారాయణ, 33 జిల్లాల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. అందరూ కలిసి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ గ్రహీత నందిని సిద్ధా రెడ్డిని ఘనంగా సత్కరించారు. అనంతరం నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ, తన 55 ఏళ్ల సాహిత్య జీవితంలో టి.యు. డబ్ల్యూ.జెతో తనకు 50 ఏళ్ల అనుబంధం ఉందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలికితీయడంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని ఆయన గుర్తు చేస్తూ, జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.



## డబుల్స్ దుకాణాల విక్రయం ద్వారా మొదటి రోజు రూ.6.09 కోట్ల ఆదాయం

**మేడ్చల్ నేడు బ్యూరో:** మేడ్చల్ జిల్లాలోని డబుల్ బెడ్రూం కాలనీలోని వాణిజ్య దుకాణాల వేలం ద్వారా రూ.6.09 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో రాంపల్లి డబుల బెడ్ రూమ్ కాలనీ దుకాణాల ద్వారా రూ.5.60 కోట్లు, కొర్రెముల లోని దుకాణాల వేలం ద్వారా రూ.35 లక్షలు, శ్రీరాం నగర్ డబుల్స్ కాలనీల దుకాణాల ద్వారా రూ. 14 లక్షలు సమకూరాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ఉన్న డబుల బెడ్ రూమ్ కాలనీలలోని 892 వాణిజ్య దుకాణాలను ఈ నెల 15, 17 తేదీలలో వేలం ద్వారా విక్రయించనున్నట్టు జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా నిన్న గురువారం ఏప్రిల్ 15న చర్లపల్లి లోని 14 దుకాణాలను, చైతన్య నగర్ లోని 14 దుకాణాలను, శ్రీరాం నగర్ లోని 30 షాప్స్ ను, కొర్రెముల లోని 22 షాప్స్ ను, రాంపల్లి లోని 80 షాప్స్ ను వేలానికి పెట్టారు. ఇందులో రాంపల్లి లో 55 దుకాణాలు, కొర్రెముల లోని 8 షాప్స్, శ్రీరాం నగర్ లోని 3 షాప్స్ మొత్తం కలిపి 66 వాణిజ్య దుకాణాలు వేలం పాటలో అమ్ముడు పోయాయి. శ్రీరామ్ నగర్ లోని డబుల బెడ్ రూమ్ వాణిజ్య దుకాణాలను చదరపు అడుగుకు ప్రభుత్వం రూ.3300 ధర నిర్ణయించగా వేలంలో చదరపు అడుగుకు రూ.5,550 లు ధర పలికాయి. అలాగే, కొర్రెములలో రూ.2000 ధర నిర్ణయిస్తే రూ.2150 లు పలికాయి. ఇక రాంపల్లి లో ప్రభుత్వం చదరపు అడుగుకు రూ.3000 ధర నిర్ణయిస్తే మినిమం రూ.4,000ల నుంచి ఎక్కువ లో ఎక్కువ రూ.11,000 (చరరపు అడుగుకు ) వరకు విక్రయం పొందాయి. వేలం పాట నేడు ఏప్రిల్ 17న కూడా నిర్వహించనున్నారు. తూంకుంట లో 41 దుకాణాలు, హమ్మద్ గూడలో 156, మురారి పల్లి లో 47 దుకాణాలను వేలం ద్వారా విక్రయించనున్నట్టు జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణమూర్తి వెల్లడించారు.

## పిచ్చికుక్కల దాడిలో మృతిచెందిన దూడ



**దేవరుప్పుల నేడు న్యూస్ :** పిచ్చి కుక్కల దాడిలో దూడ మృతి చెందిన ఘటన దేవరుప్పుల మండలం,మాదాపురం గ్రామంలో చోటు చేసుకుంది.బాధిత రైతు మారసాని కుమార్ తెలిపిన ప్రకారం బుధవారం రాత్రి యధావిధిగా దూడను పొలం వద్ద కట్టేసి వెళ్లగా రాత్రి పిచ్చి కుక్కలు దాడి చేసి హతమార్చాయి.కాగా గ్రామంలో వరుసగా ఇది మూడవసారి కావడంతో గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పిచ్చి కుక్కల నుండి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు జారీ చేస్తాం

- జీవో 252లో అవసరమైన మేరకు సవరణలు చేస్తాం
- జర్నలిజంతో సంబంధం లేనివారికి అక్రెడిటేషన్లు జారీ కాకుండా చూడాలి
- ఎలైట్ పీపుల్స్ నుంచి జర్నలిస్టులను తొలగించాలి
- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి




**మేడ్చల్, నేడు బ్యూరో:** రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు జారీ చేస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టు సంఘాలు, జర్నలిస్టుల అభ్యర్థన మేరకు 252 జీవో:లో అవసరమైన మేరకు సవరణలు చేసి డీ.పీ.ఆర్.ఓలకు పంపిస్తామని ఆయన చెప్పారు. గురువారం మేడ్చల్ జిల్లా అంతాయపల్లిలోని ఎస్.ఎన్.ఆర్ పుష్ప కన్వెన్షన్ సెంటర్ లో టీ.యూ.డబ్ల్యూ.జె (ఐజేయూ) రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టులకు జారీ చేసే అక్రెడిటేషన్ కార్డుల విషయంలో ఎలాంటి అపోహలు పడవద్దని సూచించారు. గతంలో కంటే మెరుగైన జీవోను ఈ ప్రభుత్వం తీసుకువచ్చిందని అన్నారు. సర్క్యులేషన్ ప్రాతిపదికన రాష్ట్ర, జిల్లా స్థాయిలో కార్డులను జారీ చేస్తారని అన్నారు. కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు జారీ చేసే కార్డుల విషయమై సబ్ కమిటీ వేశామని ఆ కమిటీ నివేదిక మేరకు నిర్ణయాలు తీసుకుంటామని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పెద్ద పత్రికల జర్నలిస్టులేవరికీ అన్యాయం జరగదని, ఆయా పత్రికల్లో డెస్క్ సబ్ ఎడిటర్లుగా పనిచేస్తున్న వారందరికీ అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేస్తారని అన్నారు. జర్నలిజం వృత్తితో సంబంధం లేని వారికి అక్రెడిటేషన్లు జారీ కాకుండా యూనియన్ బాధ్యులు జాగ్రత్త వహించాలని సూచించారు. నకిలీ జర్నలిస్టులకు కార్డులు అందకుండా అడ్డుకోవాలన్నారు. అక్రెడిటేషన్ కమిటీ సభ్యులకు త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి వారికి కూడా అవగాహన కల్పిస్తామన్నారు. హైదరాబాద్ లోని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సభ్యులకు ఇచ్చినటువంటి ఇళ్ల స్థలాలపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు అభ్యంతరకరమైందని, ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్.లు, ఎమ్మెల్యేల జీవితాలతో జర్నలిస్టులను పోల్చడం అభ్యంతర కరమైందన్నారు. జర్నలిస్టులు ఉన్నత వర్గాలు కాదని, ఇటీవల విజయవాడలో జరిగిన ఐజేయు ప్లీనరీ సమావేశంలో తీర్మానం చేసినట్లు శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ, సంఘం సమావేశాల్లో తీసుకునే నిర్ణయాలను క్షేత్ర స్థాయిలోకి తీసుకువెళ్లాలని, సంఘం బలోపేతం కోసం పాటుపడాలని, సభ్యుల సంఖ్య ముఖ్యం కాదని, పనిచేయడం ముఖ్యమని సూచించారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు అందే విధంగా పాటుపడాలన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీ మాట్లాడుతూ, ఆయా జిల్లాల్లో నిర్వహించాల్సిన మహా సభలను మే 15లోగా నిర్వహించాలని, మరికొన్ని జిల్లాల సభలను జూన్ 15 లోపు నిర్వహిం చాలని సూచించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టుల ందరికీ అక్రెడిటేషన్ కార్డులు వచ్చే విధంగా యూనియన్ కృషి చేస్తుం దన్నారు. అంతకుముందు మూడు మాసాల కాలంలో ప్రమాదాలు, అనారోగ్య కారణాలవల్ల మరణించిన 16 మంది జర్నలిస్టులకు నివాళి అర్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రాంనారాయణ తన నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జర్నలిస్టులకు కూడా వైద్య సదుపాయాన్ని కల్పించాలని, ఐజేయు ప్లీనరీలో చేసిన తీర్మానం మేరకు హైదరాబాద్ లో జాతీయ మహిళా జర్నలిస్టుల సదస్సును ఏర్పాటు చేయాలని, జాతీయ న్యూస్ పేపర్స్ కన్ఫడరేషన్ జాతీయ సమావేశాన్ని హైదరాబాద్ లో నిర్వహించాలని ఈ సమావేశంలో తీర్మానించారు. అలాగే రాష్ట్రంలో జర్నలిస్టులపై నమోదవుతున్న కేసులపై నిజానిర్ధారణ చేసేందుకు గాను, సీనియర్ పాత్రికేయులతో త్రిసభ్య కమిటీని నియమించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశ నిర్వహణకు మేడ్చల్ జిల్లా కమిటీ ఆతిథ్యాన్ని ఇచ్చింది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గంతో పాటు 29 జిల్లాల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. సమావేశంలో ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ మాజీద్, జాతీయ ఉపాధ్యక్షులు వై.నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్, కే సత్యనారాయణ, అజిత, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే. రాములు, కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫైసల్ అహ్మద్, బుర్ర సంపత్ కుమార్ గౌడ్, గాడిపల్లి మధు, రాష్ట్ర కార్యదర్శులు వరకాల యాదగిరి, శ్రీకాంత్ రెడ్డి, గుండ్రాతి మధు గౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జి.బాల్ రాజ్ గౌడ్, కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

# చర్లపల్లి బస్టాండ్‌లో విగ్రహాల తొలగింపు వివాదం

- బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన
- 20 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



**ఉప్పల్/ చర్లపల్లి, నేడు న్యూస్:** చర్లపల్లి బస్టాండ్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను బుధవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. ఈ విగ్రహాలు నాలుగు రోజుల క్రితమే ఏర్పాటు చేయబడినట్లు సమాచారం. ఈ ఘటనపై గురువారం ఉదయం సమాచారం అందుకున్న దళిత సంఘాలు, పలు సంస్థల నాయకులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి నాయకత్వం వహించాడు. రాజ్ బహదూర్ వెంకటరామిరెడ్డి విగ్రహానికి ఎలాంటి ఆంక్షలు లేకపోయినా, అంబేద్కర్ విగ్రహంపై చర్యలు ఎందుకు తీసుకున్నారని ఆందోళనకారులు ప్రశ్నించారు. దళిత ప్రముఖుల విగ్రహాలపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. తొలగించిన విగ్రహాలను వెంటనే తిరిగి ప్రతిష్టించాలని డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకుని సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డితో పాటు సుమారు 20 మంది ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదుపులోకి తీసుకున్న వారిలో నేమూరి మహేష్ గౌడ్, దప్పు గిరిబాబు, కొమ్ము నర్సింహా రావు, కడియాల సురేష్, కేవీఎల్ఎన్ రావు, కొమ్ము సురేష్, కడియాల నాగేష్, కడియాల అనిల్ కుమార్, కొమ్ము రమేష్, బొజ్జ పవన్, ఎడ్ల సోమయ్య, పొన్నాల సురేష్, కొమ్ము శివరాజ్, విజయరాజ్ తదితరులు ఉన్నారు. ఈ ఘటనను ఆందోళనకారులు ఖండిస్తూ, విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. డిమాండ్లు నెరవేర్చే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. మాజీ కార్పొరేటర్ జగ్రిపోతుల ప్రభుదాస్ ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి అదుపులో ఉన్న వారిని పరామర్శించారు.



# 41 గ్రామపంచాయతీల సమస్యల పరిష్కారానికి దిశానిర్దేశం

- కారేపల్లి మండల సమీక్ష సమావేశం విజయవంతం
- ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా అధికారులతో సమగ్ర చర్చ



**కారేపల్లి, నేడు న్యూస్:** మండల పరిధిలోని వైయస్సార్ గార్డెన్‌లో 99 రోజుల ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా కీలక మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది హాజరై అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సింగరేణి మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్ మాట్లాడుతూ, కారేపల్లి మండలంలోని మొత్తం 41 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న పలు సమస్యలు, అవసరాలు, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను సమగ్రంగా వివరించారు. ప్రతి గ్రామపంచాయతీలో ప్రాథమిక సదుపాయాల లోపాలు, తాగునీరు, విద్యుత్, రహదారులు, పారిశుధ్యం వంటి అంశాల్లో ఉన్న సమస్యలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను కోరారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వేగవంతమైన చర్యలు తీసుకోవాలని, ప్రతి పంచాయతీలో అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో పాల్గొన్న అధికారులు సమస్యల పరిష్కారంపై సానుకూలంగా స్పందిస్తూ, తమ పరిధిలో ఉన్న అంశాలను ప్రాధాన్యంగా తీసుకుని త్వరలోనే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సమీక్ష సమావేశం ద్వారా మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలకు మరింత వేగం తీసుకురావాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పోలంపల్లి సర్పంచ్, దిశా కమిటీ సభ్యురాలు ధరావత్ హేమలత బాలాజీ, ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు కారేపల్లి సర్పంచ్ మేదరి టోనీ తదితరులు పాల్గొన్నారు.



# 2024లోనే ఎందుకు అమలు చేయలేదు

- కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ అభ్యంతరం
- కులగణన లేకుండా చేపట్టడంలో తొందరెందుకున్న అఖిలేశ్
- విపక్షాల అభ్యంతరాలను తోసిపుచ్చిన అమిత్ షా

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 :** చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం 3 బిల్లులను లోక్‌సభ ముం దుకు తీసుకొచ్చింది. ఈ సందర్భంగా విపక్షాలు తమ అభ్యంతరాలను లేవనెత్తగా.. వాటిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. 2024లో మహిళా రిజర్వేన్లను ఎందుకు అమలు చేయలేదని లోక్‌సభలో బిల్లులు ప్రవేశపెట్టడానికి ముందు జరిగిన చర్చ సందర్భంగా కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. 2023లోనే ఆ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇచ్చామన్నారు. రాజ్యాంగాన్ని ప్రభుత్వం హైజాక్ చేస్తోందన్నారు. దీనిపై అమిత్‌షా స్పందిస్తూ.. బిల్లు ప్రవేశపెట్టకుండానే ఎలా ప్రశ్నిస్తారని అసహనం వ్యక్తంచేశారు. బిల్లు సభలో ప్రవేశపెట్టిన తర్వాత సభ్యులు తమ అభిప్రాయాలు చెప్పవచ్చన్నారు. ప్రజల్లో ఆందోళన కలిగించేలా విపక్షాల వ్యాఖ్యలు ఉన్నాయని, జనగణన ఎందుకు చేపట్టలేదని అఖిలేశ్ ప్రశ్నిస్తున్నారు. ఆ ప్రక్రియ ఇప్పటికే మొదలైందన్న విషయం గుర్తించాలి. ప్రస్తుతం ఇళ్ల గణన జరుగుతోంది. ఇళ్లకు ఎలాంటి జాతి ఉండదు. సమాజ్‌వాదీ పార్టీ ఇళ్లకు కూడా జాతిని ఆపాదిస్తోంది. వ్యక్తుల జనగణన జరిగిన సమయంలోనే జాతి ప్రస్తావన ఉంటుందని కేంద్ర మంత్రి కౌంటర్ ఇచ్చారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును సమాజ్‌వాదీ, ఎంఐఎం పార్టీలు వ్యతిరేకించాయి. దక్షిణాది ప్రాంతాలకు ప్రాతినిధ్యం లేకుండా ఈ బిల్లు చేస్తుందన్నారు. ఈ సవరణలు రాజ్యాంగ విరుద్ధమని, అవి శాండ్‌విచ్ బిల్లులని డీఎంకే ఆరోపించింది.మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లులపై లోక్‌సభలో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, హోం మంత్రి అమిత్ షాల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. ఈ ప్రక్రియను జనగణనతో ప్రారంభించాలని అఖిలేశ్ యాదవ్ తొలుత సూచించారు. కులగణనను కేంద్రం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌పై కేంద్రం దూకుడులో అర్థం ఏమిటని ప్రశ్నించారు. 'మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్రం ఎందుకు అంత తొందర ప్రదర్శిస్తోంది. మొదటగా జనగణనతో ఈ ప్రక్రియను స్టార్ట్ చేయాలి' అని ఆయన అన్నారు. మహిళా రిజర్వేషన్‌కు తన పార్టీ పూర్తి మద్దతు ఇస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. కానీ డీలిమిటేషన్ ద్వారా రిజర్వేషన్ అమలును వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈ వాదనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఘాటుగా స్పందించారు. 'దేశంలో ప్రస్తుతం జనగణన ప్రారంభమైంది. ఆ తరువాత కుల ఆధారిత సెన్సెస్ కూడా ఉంటుంది. ప్రస్తుతం గృహ గణన జరుగుతోంది. ఇళ్లు కులాల వారీగా ఉండవు. కుదిరితే ఇళ్లకు కూడా సమాజ్‌వాదీ పార్టీ కులాన్ని జోడిస్తుంది. కులగణనతో పాటు జనగణన జరుగుతుందని నేను సభకు హామీ ఇస్తున్నాను' అని హోం మంత్రి అమిత్ షా అన్నారు.



# మహిళా బిల్లుతో ఏ రాష్ట్రానికి నష్టం లేదు

- ఈ బిల్లుతో మహిళలకు లోక్‌సభలో 272 సీట్లు
- బిల్లుపై చర్చలో కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 :** మహిళా రిజర్వేషన్ల అమలుతో ఏ రాష్ట్రానికి గానీ, పురుషులకు గానీ ఎలాంటి నష్టం జరగదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ స్పష్టం చేశారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల కు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు వీలుగా కేంద్రం 3 కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అనంతరం వీటిపై చర్చ ప్రారంభించగా.. కేంద్రమంత్రి మేఘ్‌వాల్ ప్రసంగించారు. ఈ బిల్లులతో లోక్‌సభలో మహిళలకు 272 సీట్లు లభిస్తాయని అన్నారు. పార్లమెంట్ చరిత్రలో ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు. మహిళా రిజర్వేషన్లను అమలుచేయాల్సిన సమయం వచ్చింది. కొన్ని బిల్లులను భావితరాలు మరువలేవు. ఆర్టికల్ 368 ద్వారా ప్రజాహిత నిర్ణయాలను తీసుకునేందుకు పార్లమెంట్‌కు రాజ్యాంగం శక్తినిచ్చింది. ఈ క్రమంలోనే మూడు కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టాం. లోక్‌సభ స్థానాలను 50శాతానికి పెంచేందుకు వీటిని తీసుకొచ్చాం. ఈ బిల్లులతో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుంది. లోక్‌సభ స్థానాలు 815కు పెరగడంతో మహిళలకు 272 సీట్లు లభిస్తాయి. దీనివల్ల ఎవరికీ నష్టం ఉండదు. ఈ మహిళల కోటాలో ఎస్సీ, ఎస్టీలకు ఉపకోటా కూడా లభిస్తుందని కేంద్ర మంత్రి వివరించారు. అనంతరం ఈ బిల్లులను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ మాట్లాడారు. మహిళల రిజర్వేషన్లకు సంబంధించి మూడేళ్ల క్రితం ఇవే చర్చలు జరిగాయి. వాటినే కేంద్రం మళ్లీ చెబుతోంది. 2023 కంటే ముందు ఐదుసార్లు మహిళలకు సంబంధించిన చట్టాలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ మహిళల రిజర్వేషన్లకు అనుకూలంగా ఉంది. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందిన నాటినుంచే వాటిని అమలుచేయాలి. మహిళా రిజర్వేషన్లను లోక్‌సభ స్థానాల పెంపునకు ముడిపెట్టవద్దు. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేస్తామని గతంలో హోం మంత్రి చెప్పారు. మహిళా రిజర్వేషన్లను మరింత ఆలస్యం చేయాలని కేంద్రం చూస్తోందని కాంగ్రెస్ ఎంపీ విమర్శించారు.


## ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచిపెట్టే బిల్లు

### మహిళా బిల్లుపై ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ అక్కసు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 :** పార్లమెంట్ సమావేశాల్లో మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గ పునర్విభజన బిల్లుపై కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ చర్చను ప్రారంభించారు. అయితే.. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఏఐఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యతిరేకించారు. మహిళా బిల్లుకు నిరసనగా సాహిర్ లుధియాన్వి రాసిన ఓ కవితను లోక్‌సభా ముఖంగా చదివి వ్యతిరేకించారు. ఈ బిల్లు సమాఖ్య వాద ఉల్లంఘన కిందకు వస్తుందని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొంటూ.. దీనిని సభలో ప్రవేశపెట్టడాన్ని తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని అన్నారు. ఈ చర్య మహిళా రిజర్వేషన్‌కు సంబంధించినది కాదని, ఇది ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచివేసే చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు. జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకు ఈ బిల్లు మరింత అధికారాన్ని ఇస్తుందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అరికడుతుందని ఒవైసీ వాదించారు.

## ఫ్రెండ్‌తో బెట్ వేసి.. బాలికలను ట్రాప్ చేసి

### అశ్లీల వీడియోల కేసులో నిందితుడి తీరు




**అమరావతి :** మహా రాష్ట్రలోని అమరావతి జిల్లాలో 180 మంది బాలికలను లైంగికం గా వేధించి.. వారికి సంబంధించిన 350 కు పైగా అశ్లీల వీడి యోలు తీసిన ఘటన తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఇందులో ప్రధాన నిందితుడైన మహమ్మద్ అయాన్ అలియాస్ తన్వీర్ (19)కు సంబంధించి మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. మిత్రుడితో పందెం కాసి మరీ నిందితుడు అమ్మాయిలను ట్రాప్ చేసేవాడని, ఆ తర్వాత వారి వీడియోలు రికార్డ్ చేసినట్లు తేలింది. కాగా.. డబ్బు విషయంలో వీరి మధ్య వచ్చిన విభేదాలతోనే ఈ దారుణాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. నిందితుడు తన్వీర్, అతడి స్నేహితుడు ఉజైర్‌తో కలిసి అమ్మాయిలను ట్రాప్ చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఎవరికి ఎక్కువమంది అమ్మాయిలు దొరుకుతారనే విషయంలో వీరిద్దరూ తరచూ బెట్టింగ్‌లు వేసుకునేవారని సమాచారం. ఎక్కువగా కాలేజీకి, కోచింగ్ ఇనిస్టిట్యూట్‌కు వెళ్లే మైనర్ బాలికలను వీరు లక్ష్యంగా చేసుకున్నట్లు సమాచారం. అయితే, ఇటీవల డబ్బు విషయంలో వీరి మధ్య విభేదాలు వచ్చాయి. తన్వీర్ తనకు ఇవ్వాల్సిన మొత్తం చెల్లించట్లేదని కక్ష పెంచుకున్న ఉజైర్.. ఈ వీడియోలను ఆన్‌లైన్‌లో పోస్ట్ చేశాడు. దీంతో ఈ వ్యవహారం బయటపడింది.

### ఫ్రెండ్‌కు రూ.500 ఇచ్చి..


అలా ట్రాప్ చేసిన అమ్మాయిలను తన్వీర్ తన మరో మిత్రుడి ఫ్లాట్‌కు తీసుకెళ్లేవాడట. ఇందుకోసం ఆ వ్యక్తికి అక్కడికి వచ్చిన ప్రతిసారీ రూ.500 ఇచ్చేవాడు. అక్కడ వారితో సన్నిహితంగా ఉన్న వీడియోలను రికార్డ్ చేసినట్లు సమాచారం. అనంతరం ఆ వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేసిన బాలికలపై పలుమార్లు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిసింది. ఈ కేసులో ఇప్పటివరకు తన్వీర్‌తో సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రజల నుంచి అందిన ఓ వినతిపత్రం ద్వారా రాజ్యసభ సభ్యుడు అనిల్ బోండేకు ఈ విషయం తెలియడంతో నిందితుడి అకృత్యాలు వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. తన్వీర్ ఫోన్‌లో వందలకొద్దీ అసభ్యకరమైన వీడియోలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇక, ఆన్‌లైన్‌లో షేర్ చేసిన వీడియోలను సైబర్ సెల్ సాయంతో తొలగించే చర్యలు చేపట్టారు. నిందితుడి నివాసానికి సంబంధించిన అక్రమ కట్టడాలపై మహారాష్ట్ర ప్రభుత్వం బుల్డోజరుతో కూల్చివేత చర్యలు చేపట్టింది.

# మెసేజ్ వస్తోంది.. సిలిండర్ రాదు!

- మేడ్చల్ భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్లక్ష్యంపై వినియోగదారుల ఆగ్రహం
- నెల రోజులుగా నిరీక్షణ.. కరువైన సమాధానం
- డెలివరీ కాకుండానే మెసేజ్‌లు.. అసలేం జరుగుతోంది ?
- బ్లాక్ మార్కెట్ ఆరోపణలు
- ఉన్నతాధికారులు స్పందించాలి




మేడ్చల్ మోడ్రన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం ముందు వినియోగదారులు



గ్యాస్ సిలిండర్ బుక్ చేసి గత నెలలో ఆన్లైన్లో పేమెంట్ చేసిన రిసిప్ట్

**మేడ్చల్, నేడు న్యూస్ :** సామాన్యుడి వంట గదిలో మంటలు పుడుతున్నాయి. సిలిండర్ బుక్ చేస్తే నెల రోజులు గడిచినా ఇంటికి రావడం లేదు. తీరా ఏజెన్సీకి వెళ్లి అడిగితే నిర్లక్ష్యపు సమాధానాలు.. పైగా చేతికి అందకుండానే డెలివరీ అయినట్లు ఫోన్‌కు మెసేజ్‌లు. మేడ్చల్ చెక్ పోస్ట్ పారిశ్రామికవాడలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ తీరుపై వినియోగదారులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.



సిలిండర్ ఇవ్వకముందుకే డెలివరీ ఇచ్చినట్లు వచ్చిన మెసేజ్

### నెల రోజులుగా నిరీక్షణ.. కరువైన సమాధానం :

గత 20 నుంచి 30 రోజులుగా గ్యాస్ కోసం ఏజెన్సీ చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం పెద్ద సంఖ్యలో వినియోగదారులు ఏజెన్సీ కార్యాలయానికి చేరుకోగా, కనీసం సమాధానం చెప్పే నాథుడే కరువయ్యాడు. "స్టాక్ లేదు" అని ఒకే మాటతో సిబ్బంది చేతులు దులుపుకుంటున్నారని, ప్రశ్నిస్తే ఎదురు దాడికి దిగుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఈ ఏజెన్సీ వ్యవహారంలో ప్రధానంగా వినియోగదారులను వేధిస్తున్న అంశం "ఫేక్ డెలివరీ మెసేజ్‌లు" సిలిండర్ ఇంటికి రాకపోయినా, ఫోన్‌లకు మాత్రం 'సక్సెస్‌ఫుల్ డెలివరీ' అని మెసేజ్‌లు వస్తుండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. అసలు గ్యాస్ స్టాక్ లేనప్పుడు మెసేజ్‌లు ఎలా వస్తున్నాయని వినియోగదారులు నిలదీస్తున్నారు.

### బ్లాక్ మార్కెట్ ఆరోపణలు :


సామాన్య వినియోగదారులకు అందాల్సిన సిలిండర్లను ఏజెన్సీ నిర్వాహకులు పక్కదారి పట్టిస్తున్నారని బహిరంగంగానే ఆరోపణలు వస్తున్నాయి. అధిక లాభాల కోసం హోటళ్లకు, వాణిజ్య అవసరాలకు బ్లాక్‌లో విక్రయిస్తూ, లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. పనులు మానుకొని రోజూ ఏజెన్సీ చుట్టూ తిరగలేక కష్టజీవులు నానా అవస్థలు పడుతున్నారు.

### ఉన్నతాధికారులు స్పందించాలి :

ఏజెన్సీ నిర్వాహకుల తీరుతో విసిగిపోయిన మేడ్చల్ మండల ప్రజలు తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని వేడుకుంటున్నారు. డెలివరీ మెసేజ్‌ల వెనుక ఉన్న మర్మాన్ని బయటపెట్టి, నిరంతరాయంగా గ్యాస్ సరఫరా అయ్యేలా చూడాలని, బాధ్యులైన ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# అంత భావోద్వేగం వద్దు

### 'అశోకచక్రం'పై పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం



**న్యూఢిల్లీ :** జాతీయ పతాకంపై అశోక చక్రం ఎలా చూపాలన్న దానిపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టేసింది. ఈ అంశంపై విచారణకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. 'సమాజానికి ఉపయోగపడే అంశాలను ధర్మాసనం ముందుకు తీసుకురావచ్చు కదా' అని పిటిషనర్‌పై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో ఓ కూడలిలో ఉంచిన అశోక చక్రాన్ని ఉదహరిస్తూ పిటిషనర్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పందిస్తూ.. "ఇలాంటి విషయాల్లో భావోద్వేగానికి గురవ్వాల్సిన అవసరం లేదు. మీ ఆలోచన మంచిదే.. కానీ సంబంధిత అధికారులతో ఈ విషయాన్ని చర్చించండి. దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడండి. సమాజానికి ఉపయోగపడేవి, నిర్మాణాత్మకమైన పనులను చేయండి" అని పిటిషనర్‌కు సూచించింది. గతంలో న్యాయవాది సచిన్ గుప్తా దాఖలు చేసిన 25 ప్రజాప్రయోజన వ్యాజ్యాలు విచారణ నేపథ్యంలో ఆ పిల్స్ ఆధారరహితంగా, అస్పష్టంగా ఉన్నాయి, వాటిని విత్‌డ్రా చేసుకోమని ధర్మాసనం సలహా ఇచ్చిన సంగతి తెలిసిందే. గతంలో ఆ పిల్స్‌ను గుప్తా ఉపసంహరించుకోగా.. తాజాగా ఆయన దాఖలు చేసిన మరో 47 పిల్స్ నుంచి ఉపయోగపడని కొన్నింటిని విత్‌డ్రా చేసుకోమని ధర్మాసనం సూచించింది. "కోర్టు అనుమతితో ఈ పిల్స్‌ని ఉపసంహరించుకుంటా" అని సచిన్ ధర్మాసనానికి తెలిపారు.

# ఇరాన్ చమురుపై మళ్లీ ఆంక్షలు

### అమెరికా కీలక నిర్ణయం



**వాషింగ్టన్ :** పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచం ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయింది. ఈ క్రమంలో ఇరాన్ చమురుపై మరిన్ని ఆంక్షలు విధిస్తూ.. అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. టెహ్రాన్‌పై ఆర్థిక ఒత్తిడిని పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. యూఎస్ ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ బుధవారం (అమెరికా కాలమాన ప్రకారం) ఆంక్షలను ప్రకటించారు. ఇరాన్, రష్యా చమురు కొనుగోళ్లకు సంబంధించి ఉన్న ఆంక్షలను ఇటీవల అమెరికా సడలించిన సంగతి తెలిసిందే. ఈ సడలింపును పొడిగించేది లేదని తాజాగా బెసెంట్ స్పష్టంచేశారు. ఈ క్రమంలోనే ఇరాన్ చమురు ఎగుమతులతో సంబంధాలు ఉన్న అనేకమంది వ్యక్తులు, చమురు సంస్థలు, నౌకలపై ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రెజరీ శాఖకు చెందిన విదేశీ ఆస్తుల నియంత్రణ కార్యాలయం ప్రకటించింది. ఆంక్షలకు గురైన సంస్థలు.. ఇరాన్ మాజీ సుప్రీం నేత అయతుల్లా అలీఖమేనీ రాజకీయ సలహాదారుడి కుమారుడు మహమ్మద్ హుస్సేన్ షమ్‌ఖానీ నేతృత్వంలోనివని తెలిపింది. ఫిబ్రవరిలో అమెరికా– ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో అలీ ఖమేనీ సలహాదారుడు ప్రాణాలు కోల్పోయారు. హర్మూజ్ జలసంధిలో ఇరాన్ నౌకల రాకపోకలను అమెరికా దిగ్బంధిస్తోన్న సంగతి తెలిసిందే. ఇది ఇరాన్‌పై ఆర్థికంగా తీవ్ర ఒత్తిడి కలిగించనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆ దేశ చమురుపై మరిన్ని ఆంక్షలు విధించడం గమనార్హం. ఇక, ఇరాన్ ఆర్థిక లావాదేవీలకు చైనా బ్యాంకులు సహకరించినట్లు తెలిస్తే.. వాటిపై ఆంక్షలు విధించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని బెసెంట్ హెచ్చరించారు.

### పెట్రో కెమికల్ ఎగుమతులు నిలిపివేసిన ఇరాన్

తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు అన్ని పెట్రో కెమికల్ ఎగుమతులు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఇరాన్‌కు చెందిన జాతీయ పెట్రోకెమికల్ కంపెనీ పేర్కొంది. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులు, శత్రు దాడుల వల్ల కలిగిన నష్టాల నేపథ్యంలో దేశీయ పరిశ్రమలకు, వినియోగదారులకు ప్రాధాన్యం ఇచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఎగుమతి అయి.. ఇంకా విదేశాలకు చేరని సరకును కూడా వెనక్కి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా కంపెనీలకు సూచించింది.

# కొత్త నిబంధనలు.. బోర్డింగ్ మిస్సైన 120 మందికి పైగా ప్రయాణికులు

**ఐరోపా :** ఐరోపాలో కొత్త నిబంధనల కారణంగా బోర్డింగ్ సమయంలో 120 మందికి పైగా ప్రయాణికులు ఫ్లైట్ మిస్ అయ్యారు. ఐరోపాలో తాజాగా బోర్డర్ కంట్రోల్ సిస్టమ్ అమల్లోకి వచ్చింది. ఈనేపథ్యంలో ప్రయాణికుల పాస్‌పోర్టు స్టాంపింగ్‌కు బదులు బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్స్ స్కాన్ చేయాల్సిఉంది. ఈ క్రమంలోనే చెకింగ్ ఆలస్యమవడంతో వారు ఎయిర్‌పోర్టులో ఉన్నా ఫ్లైట్ ఎక్కలేకపోయారు. మిలాన్ నుంచి మాంచెస్టర్‌కు వెళ్లేందుకు 156 మంది ప్రయాణికులు టికెట్ బుక్ చేసుకున్నారు. ప్రయాణానికి కొన్ని గంటల ముందే వారంతా విమానాశ్రయానికి చేరుకున్నారు. ముందస్తు తనిఖీల కారణంగా పాస్‌పోర్ట్ చెకింగ్ క్యూ వద్ద కనీసం 3-4 గంటల సమయం పట్టడంతో చాలామంది బోర్డింగ్ గేట్‌కు చేరుకోలేకపోయారు. 156 మందిలో కేవలం 34 మంది పాస్‌పోర్ట్‌లు మాత్రమే చెకింగ్ పూర్తయ్యాయి. దీంతో దాదాపు 120 మంది ప్రయాణికులు ఫ్లైట్‌ని మిస్ అయ్యారు. టెర్మినల్ లోపల చాలా రద్దీగా ఉండడంతో గంటలతరబడి క్యూ కదల్లేదని ప్రయాణికులు వాపోయారు. కొత్త పద్ధతుల్లో చెకింగ్ చేయడంతో కొందరు గంటలతరబడి నిల్చొనే ఉండటం వల్ల అస్వస్థతకు గురయ్యారని పేర్కొన్నారు. ప్రయాణికుల కోసం విమానాన్ని కొంత సమయం ఆపినా.. తర్వాత భద్రతా కారణాల రీత్యా బయల్దేరవలసి వచ్చింది. సరిహద్దు భద్రత కారణంగా యూరోపియన్ దేశాలు కొత్తగా ఎంట్రీ/ ఎగ్జిట్ సిస్టమ్ తనిఖీని ప్రారంభించారు. దీంతో బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్, డేటాబేస్ చెకింగ్ వల్లే ఈ ఆలస్యం జరిగిందని ఎయిర్‌పోర్టు అధికారులు పేర్కొన్నారు.



# సుస్థిర, సుదీర్ఘ శాంతికి ప్రధాని మోదీ పిలుపు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 :** పశ్చిమాసియా, ఉక్రెయిన్‌ల్లో సుస్థిర, సుదీర్ఘ శాంతికి ప్రధాన మంత్రి మోదీ పిలుపునిచ్చారు. ఆస్ట్రియన్ ఛాన్సెలర్ క్రిస్టియన్ స్టాకర్‌తో కలిసి ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధ క్షేత్రాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. "కొన్ని దేశాల యుద్ధం కారణంగా ప్రపంచం మొత్తం ఉద్రిక్త పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఆ ప్రభావం మనందరి జీవనాలపై పడుతోంది. ఈ సైనిక ఘర్షణలకు ఇంకా పరిష్కారం లభించలేదు. అది ఉక్రెయిన్ అయినా, పశ్చిమాసియా అయినా శాశ్వత శాంతి, సుస్థిరత కావాలని కోరుకుంటున్నాం. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవడానికి సంస్కరణలు చేపట్టాలి. ఇందుకోసం ఉగ్రవాదాన్ని పారదోలడం ఎంతైనా అవసరం" అని మోదీ పేర్కొన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత ఆస్ట్రియా ఛాన్సెలర్ క్రిస్టియన్ స్టాకర్ రాకతో భారత్‌లో వాణిజ్య, పెట్టుబడుల రంగంలో నూతనోత్సాహం మొదలైందని మోదీ తెలిపారు. భారత్– ఈయూ మధ్య కొత్త ఒప్పందాలతో సువర్ణాధ్యాయం ప్రారంభం కానుందని పేర్కొన్నారు. ఆస్ట్రియా ఛాన్సెలర్ పలు రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసేందుకు నాలుగురోజుల పాటు భారత్‌లో పర్యటిస్తున్నారు.



# హైదరాబాద్ రావాల్సిన విమానాన్ని ఢీకొన్న స్పైస్‌జెట్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 :** దేశ రాజధాని దిల్లీ ఎయిర్‌పోర్టులో స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. రన్‌వేపై ఆగి ఉన్న ఆకాశ ఎయిర్ విమానాన్ని స్పైస్‌జెట్ విమానం పక్కనుంచి ఢీకొట్టింది. అయితే, ఈ ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. దిల్లీ నుంచి హైదరాబాద్ బయల్దేరేందుకు ఆకాశ ఎయిర్ విమానం రన్‌వేపై ఉంది. అదే సమయంలో పార్కింగ్ వైపు ప్రయాణిస్తున్న స్పైస్‌జెట్ విమానం.. ఆకాశ విమానాన్ని పక్కనుంచి తాకుతూ వెళ్లింది. ఈ ప్రమాదంలో స్పైస్‌జెట్ కుడివైపు రెక్క భాగం ధ్వంసమవ్వగా.. ఆకాశ ఎయిర్ విమానం ఎడమవైపు భాగం స్వల్పంగా దెబ్బతింది. ప్రమాదంపై ఆకాశ ఎయిర్ అధికార ప్రతినిధి స్పందించారు. "ఈ ఘటనతో ప్రయాణికులు, సిబ్బందిని వెంటనే విమానం నుంచి కిందకు దింపాం. వారి భద్రత మా ప్రథమ ప్రాధాన్యం. ప్రయాణికులను హైదరాబాద్ పంపించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం" అని వెల్లడించారు. అటు స్పైస్‌జెట్ కూడా ప్రమాదాన్ని ధ్రువీకరించింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు.

# కిల్లింగ్ లుక్స్‌లో డింపుల్ హయాతి

మోస్ట్ బ్యూటిఫుల్ హీరోయిన్ డింపుల్ హయాతి గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఇప్పటివరకు ఈ బ్యూటీ అనేక తెలుగు చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈమె నటించిన చిత్రాల్లో తన నటనతో పాటు అందాలతో ప్రేక్షకులకు మరింత దగ్గర అయింది. కేవలం సినిమాల్లో మాత్రమే కాకుండా సోషల్ మీడియాలో కూడా ఈమె స్కిన్ షోతో అభిమానులను ఆకట్టుకుంటూ వస్తుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలను పోస్ట్ చేసింది. అందులో బ్రౌన్ కలర్‌లో ఉన్న టైట్ డ్రెస్ ధరించి తన హాట్ ఎద అందాలతో యువతకు మత్తెక్కించింది. ఈ ఫోటోలలో ఈమె చేతికి బ్లాక్ కలర్ వాచ్ ధరించి, ఒక ఉంగరాన్ని పెట్టుకుని, మెడలో సన్నటి చైన్ ధరించి కిల్లింగ్ లుక్స్‌లో స్టిల్స్ ఇచ్చింది. ఇక ఇందులో ఈమె తన కురులను ముందుకు, సైడ్‌కు వేసుకుని ఇచ్చిన పోజులు ఈమె అందాన్ని మరింతగా హైలెట్ చేశాయి. ప్రస్తుతం ఈ పిక్స్ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలకు అభిమానుల నుండి లైక్స్, కామెంట్స్ కూడా వెల్లువెత్తుతున్నాయి. ఇక ఈ ముద్దుగుమ్మ సినిమాల విషయానికి వస్తే, ఈ సంక్రాంతి కానుకగా ఈమె నటించిన భర్త మహాశయులకు విజ్ఞప్తి చిత్రం విడుదలైంది. ప్రస్తుతం ఈ బ్యూటీ శర్వానంద్ హీరోగా రూపొందుతున్న భోగి చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది.




# సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ.. ఏక్‌దిన్

స్టార్ బ్యూటీ సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'ఏక్ దిన్'. అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. హీరోయిన్ (సాయి పల్లవి) ఇందులో ఒక అరుదైన వ్యాధితో బాధపడుతుంటుంది. అయితే తనను ప్రేమించిన హీరో (జునైద్) అమెతో ఒక్కరోజు అయిన ప్రేమతో గడపాలని కోరుకుంటాడు. అయితే ఆ ఒక్క రోజు వారి జీవితాలను ఎలా మార్చేసింది అనేది కథాంశం. తెలుగులో ఈ చిత్రం ఒక రోజు అనే పేరుతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాకు సునీల్ పాండే దర్శకత్వం వహిస్తుండగా.. అమీర్ ఖాన్, మన్సూర్ ఖాన్, అపర్ణ పురోహిత్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రామ్ సంపత్ సంగీతం అందిస్తున్నాడు. సాయి పల్లవి హిందీలో నటిస్తున్న మొదటి సినిమా కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి.



# స్వయంభూ నుంచి రారా ధీవర పాట ప్రోమో విడుదల

టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ'. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రాగా, ఇప్పుడు ఈ చిత్రం మ్యూజికల్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది చిత్రయూనిట్. ఇందులో భాగంగా ఈ సినిమాలోని మొదటి పాట 'రా రా ధీవర' పాటకి సంబంధించిన ప్రోమోను విడుదల చేసింది. దీనికి సంబంధించిన ఫుల్ పాటను ఈరోజు సాయంత్రం 6.03 గంటలకు విడుదల చేయ-ంబోతున్నట్లు తెలిపింది. ఒక యోధుడి స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా సాగే ఈ గీతం ప్రేక్షకులను ఆకట్టుకోనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ వేసవిలో 'స్వయంభూ' వెండితెరపై భారీ స్థాయిలో సందడి చేయనుంది.






# సందీప్ కిషన్.. పవర్‌పేట

'పవర్ పేట'సినిమాపై గురువారం అధికారిక ప్రకటన వెలువడింది. సందీప్ కిషన్ హీరోగా ఈ చిత్రం తెరకెక్కనుంది. సందీప్ యాక్టింగ్ కెరీర్‌కు 16 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కొత్త సినిమా పోస్టర్‌ను టీమ్ విడుదల చేసింది. చెస్ బోర్డుపై రక్తపు మరకలు, ఎర్ర గులాబీతో డిజైన్ చేసిన పోస్టర్ సినిమాపై ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ప్రేమ, గౌరవం, రాజకీయం ప్రధానాంశాలుగా ఈ సినిమా తెరకెక్కనున్నట్లు అర్థమవుతోంది. కృష్ణచైతన్య దర్శకత్వం వహించే ఈ చిత్రానికి మణిశర్మ మ్యూజిక్ డైరెక్టర్. 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారు. హీరోయిన్, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు. ఓ ప్రియా ప్రియా, చిన్నదాన నీకోసం (ఇష్క్), గుండెజారి గల్లంతయ్యిందే తదితర హిట్ పాటలను రాసిన కృష్ణ చైతన్య 'రౌడీ ఫెలో'తో దర్శకుడిగా మారిన సంగతి తెలిసిందే. తర్వాత 'ఛల్ మోహన్ రంగ', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' తెరకెక్కించారు. ఎప్పటినుంచో 'పవర్ పేట'పై చర్చ నడుస్తోంది. చైతన్య ముందుగా ఈ సినిమాని నితిన్‌తో తెరకెక్కిస్తున్నట్లు గతంలో వార్తలొచ్చాయి. కానీ, అది కార్యరూపం దాల్చలేదు. ఈ క్రమంలో విశ్వక్‌సేన్ పేరు తెర పైకి వచ్చింది. దానిపైనా స్పష్టత రాకపోవడంతో.. సందీప్ కిషన్‌తో చేయనున్నారంటూ ఇటీవల ప్రచారం జరిగింది. ఎట్టకేలకు ఇప్పుడు అనౌన్స్‌మెంట్ వచ్చింది.

# కురుప్పులో త్రిషను ఒప్పించా

## దర్శకుడు ఆర్జె బాలాజీ వెల్లడి

నటుడిగా ప్రేక్షకులకు వినోదం పంచిన ఆర్జే బాలాజీ దర్శకుడిగానూ విజయం అందుకున్న సంగతి తెలిసిందే. 'మూకుతి అమ్మన్' (అమ్మోరు తల్లి), 'వీట్ల విశేషం' తర్వాత ఆయన తెరకెక్కించిన చిత్రం 'కరుప్పు' . తెలుగు టైటిల్ 'వీరభద్రుడు' సూర్య హీరోగా నటించిన ఈ సినిమా మే 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న బాలాజీ.. ఈ మూవీ హీరోయిన్, సంగీత దర్శకుడి ఎంపిక గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. నేను గతంలో త్రిషతో ఓ సినిమా చేయాలని అనుకున్నా. కానీ, అది సాధ్యపడలేదు. అందుకే 'కరుప్పు' కోసం సంప్రదించా. స్క్రిప్ట్ వినగానే ఆమెకు బాగా నచ్చడమే కాక, కథానాయిక పాత్రనూ ఇష్టపడటంతో నటించేందుకు ఆమె అంగీకరించారు. తన క్యారెక్టర్‌కు సంబంధించిన షూటింగ్ పూర్తయినా.. మాతో కలిసి సెట్‌కు వచ్చేవారు. 'ఆరు' తర్వాత 22 ఏళ్లకు మళ్లీ సూర్య- త్రిష కలిసి ఈ మూవీలో నటించారని పేర్కొన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ గురించి మాట్లాడుతూ.. 'మూకుతి అమ్మన్' విడుదలయ్యాక నేను, ఏఆర్ రెహమాన్ మీట్ అయ్యాం. ఆ సమయంలోనే మేం కలిసి వర్క్ చేయాలని అనుకున్నాం. కొన్నాళ్ల విరామం తర్వాత 'కరుప్పు' కోసం ఆయన్ను కలిశా. వ్యక్తిగత కారణాల వల్ల ఈ సినిమాకి పని చేయలేకపోయారు. 'ఈ చిత్రానికి నేను పూర్తిస్థాయిలో వర్క్ చేయగలనని అనుకోవడం లేదు. పైగా సినిమా షూటింగ్ మొదలైంది. ఇప్పుడేం చేద్దాం' అని ఆయన అంటుంటే నాకు బాధ కలిగింది. అప్పటికే ఓ పాట అత్యవసరం కావడంతో.. సాయి అభ్యంకర్‌ను తీసుకున్నా' అని తెలిపారు.






# రమేశ్‌బాబు తనయుడు తెరంగేట్రం

మంగ లేకపోతే తిరుపతి వదిలివెళ్లే ప్రసక్తే లేదు అంటున్నాడు శ్రీను. ఎంతగానో ప్రేమించిన మంగ తనది కాదు అని తెలిసిన క్షణం శ్రీను ఏ నిర్ణయం తీసుకున్నాడో తెలియాలంటే 'శ్రీనివాస మంగాపురం' చూడాల్సిందే. సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, మహేశ్‌బాబు సోదరురుడ రమేశ్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రమిది. రవీనా టాండన్ కుమార్తె రషా థడానీ కథానాయిక. మోహన్‌బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. అజయ్ భూపతి దర్శకుడు. అగ్ర నిర్మాత సి.అశ్వనీదత్ సమర్పణలో... చందమామ కథలు పిక్చర్స్ పతాకంపై పి.కిరణ్ నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమా టీజర్‌ని ప్రముఖ కథానాయకుడు మహేశ్‌బాబు సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. 'ఈ క్షణం ఇప్పటికిప్పుడు నీకేమనిపిస్తుంది... నేనస్సలు నీ ఫ్రెండ్ లిస్ట్‌లో ఉన్నానా?' అంటూ కథానాయకుడు అడగ్గా, టాప్ టెన్‌లో ఉంటావులే... అంటూ కథానాయిక ఇచ్చే సమాధానంతో టీజర్ మొదలవుతుంది. శ్రీను, మంగా అనే యువ జంట చుట్టూ అల్లుకున్న కథతో ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. 'అందమైన జంట, ఆకట్టుకునే ప్రేమకథ, హత్తుకునే భావోద్వేగాలు, అత్యున్నత నిర్మాణ విలువలతో తెరకెక్కుతోన్న చిత్రమిది. తిరుపతి నేపథ్యం సినిమాకి మరింత కొత్తదనాన్ని తీసుకొచ్చింద'ని సినీవర్గాలు చెప్పాయి. ఈ చిత్రానికి సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం: జయకృష్ణ, కూర్పు: మాధవ్ కుమార్ గుళ్లపాటి, ప్రొడక్షన్ డిజైన్: సాహి సురేశ్.

# మంచిర్యాలలో 45 డిగ్రీల ఎండలో షూటింగ్

## సంయుక్త మీనన్ ఎమోషనల్ పోస్ట్



యంగ్ బ్యూటీ సంయుక్త మీనన్ ప్రస్తుతం తన నెక్ట్స్ మూవీ 'బ్లాక్ గోల్డ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. సింగరేణి బొగ్గు గనుల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం తెలంగాణలోని మంచిర్యాలలో జరిగిన అత్యంత కఠినమైన షెడ్యూల్‌ను ఆమె విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో సంయుక్త షేర్ చేసిన ఒక ఎమోషనల్ పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. మంచిర్యాల ప్రాంతంలో వేసవి తీవ్రత ఏ స్థాయిలో ఉంటుందో అందరికీ తెలిసిందే. షూటింగ్ సమయంలో అక్కడ ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీల వరకు ఉన్నాయని సంయుక్త తెలిపారు. "మంచిర్యాల మమ్మల్ని అన్ని విధాలుగా పరీక్షించింది. ఎండ తీవ్రంగా ఉన్నా, ఆ వేడిలో, అలసటలో కూడా మా టీమ్ ఎక్కడా తగ్గకుండా పనిచేసింది. సినిమా అనేది ఒకరి ప్రయాణం కాదు, ఎంతో మంది హృదయాలు, కష్టం కలిస్తేనే అది సాధ్యమవుతుంది. అలాంటి దృఢత్వం ఉన్న టీమ్‌లో భాగమైనందుకు నేను చాలా గర్వపడుతున్నాను" అని ఆమె రాసుకొచ్చారు. ఇంతటి తీవ్రమైన పరిస్థితుల్లో షూటింగ్ చేస్తున్నప్పుడు డీహైడ్రేషన్, ఎండదెబ్బ వంటి సమస్యలు రావడం సహజం. అయితే తనను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా చూసుకుంటూ, ముందుకు నడిపించిన తన వ్యక్తిగత బృందానికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com